

## కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

**హుస్నాబాద్ టౌన్, జనవరి 13, ప్రభాతవార్త :** కేంద్ర సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ మంగళవారం హుస్నాబాద్ నియోజక వర్గంలోని కొత్తకొండ వీరభద్రస్వామి దర్శనానికి వెళ్తున్న సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరిం చారు. స్వాగతం పలికినవారిలో పార్టీశ్రేణులు వెంకటేష్, నాగార్జున్, రాంప్రసాద్, లక్ష్మయ్య, సాయిరామ్, రాజు, నరేష్, రవి, సమ్మయ్య, కాయిత అరుణ్‌రెడ్డి, వరియోగుల అనంత స్వామి, శ్రీనివాస్, సాంబరాజు ఉన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## నేటి నుంచి పాత పంటల జాతర

### -డిడిఎస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దివ్య వెలుగురి

**జహీరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా ప్రతి సంక్రాంతి పర్వదినం రోజు నుంచి ప్రారంభించే పాత పంటల జాతర ఏర్పాటుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం పట్టణ శివారులోని డిడిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిడిఎస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దివ్య వెలుగురి మాట్లాడుతూ జనవరి 24వ తారీఖు నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు పాత పంటల జాతరను ప్రతి సంవత్సరం మాదిరిగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కనుమరుగవుతున్న పాత పంటల రక్షణ కొరకు డిడిఎస్ పాత పంటల జాతరను నిర్వహిస్తూ రైతుల్లో పాతపంటలతో కలిగే ప్రయోజనలను వివరిస్తూ పాత పంటల సాగుకు ఉత్సాహం చేస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిడిఎస్ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## యూరియా పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**మిరుదొడ్డి, జనవరి 13,ప్రభాతవార్త :** యాసంగి సీజనల్‌లో రైతులకు యూరియా పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. మిరుదొడ్డిలోని ఎస్ హకా సర్వీస్ సెంటర్-2లో యూరియా పంపిణీ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రైతులకు యాసింగి సీజన్‌లో ఎక్కడా యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని పాసుబుక్ తీసుకుని వచ్చి యూరియా కార్డులను తీసుకోవాలన్నారు. ఎకరాకు 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. కౌలు రైతులు సైతం అధైర్య పడవద్దని మీరు చేస్తున్న వ్యవసాయ క్షేత్ర పట్టేదర్ పాస్‌బుక్ లేదా జిరాక్స్ తీసుకువస్తు యూరియా అందించడం జరుగుతుందన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మిరుదొడ్డిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు, ఓపి రిజిస్టర్‌ను పరిశీలించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను డిస్పోజల్ ప్రక్రియ, ఎలక్ట్రోరల్ మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు.

## మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం

**తొగుట, జనవరి 13, ప్రభాతవార్త :** తొగుట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం మంగళవారం దుబ్బాక పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్ కార్మిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చెరుకు విజయ్‌రెడ్డి(అమర్), వైస్ చైర్మన్‌గా కొంగరి నరసింహులుతో పాటు పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, పొగాల కొండల్‌రెడ్డి, బాలరాజు, భరత్‌తేజ, రామస్వామి పాల్గొన్నారు.

## అఖిల భారత కళా ప్రదర్శనలో మహేష్ ప్రతిభ



కళాఖండాలను ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

**సిద్ధిపేట అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త :** హైదారాబాద్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే 85వ అఖిల భారత వార్షిక కళా ప్రదర్శన 2026 ఈనెల 12న హైదారాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా ప్రారంభమైనట్లు కళాకారుడు మహేష్ మంగళవారం తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ చిత్రకారులు కళాఖండాలను ప్రదర్శనలో ఉంచగా సిద్దిపేటకు చెందిన సామలేటీ మహేష్ తీసిని పల్లె జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించే చిత్రం ప్రదర్శనకు ఎంపికైంది. ప్రదర్శనలను తెలంగాణ స్టేట్ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, హైదారాబాద్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి, జి.వెంకటేశ్వర్లు, ఆర్టిస్ట్ కంది నరసింహులు, రాజేందర్, అనంతయ్య, సత్యగన్నోజు, మధు చిత్రాలను తిలకించారని తెలిపారు.

## క్రీడా స్ఫూర్తితో జీవితాన్ని గెలవాలి

### మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

**పాపన్నపేట, జనవరి 13, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో జీవితాన్ని గెలవాలని మెదక్ అడిషనల్ ఎస్పీ మహెందర్ పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని మిన్పూర్లో మంగళవారం ప్రారంభమైన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతు కబడ్డీ గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందన్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థి జీవితంలో ఆటలు భాగస్వామ్యం కావాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి వ్యక్తి క్రీడల్లో గెలుపోట ములను స్ఫూర్తిగా తీసుకొని, జీవితంలో తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని కోరారు. గెలిచినా, ఓడినా లక్ష్యాన్ని చేరే వరకు పట్టు వీడొద్దని తెలిపారు. మిన్పూర్ లాంటి చిన్న గ్రామం నుండి పలువురు యువకులు, విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సృజన, యేసురత్నం, ఉపసర్పంచ్ కిరణ్, ప్రభాకర్ రెడ్డి, ఐజేయు రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, టీచర్ దేవయ్య, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, మాజీ ఎంపిటిసి కుబేరుడు, బీస గోపాల్, బాబర్, గోపాల్, కుర్తివాడ సర్పంచ్ శ్రీధర్, పీఇటిలు పాషా, బుజ్జి, నర్సింలు, వార్డు మెంబర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్ తదితరులు

# ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు

### రాష్ట్ర కార్మిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/సిద్దిపేట అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త :** పేదలు సొంత ఇంటిలో నివసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కార్మిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి, వెల్కటూర్, నాంచార్‌పల్లి తదితర గ్రామాలలో మంగళవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మిట్టపల్లిలో రూ.2.30 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ అదనపు తరగతి గదులను ఆయన మెదక్ ఎంపి రఘునందన్‌రావు, జిల్లా కలెక్టర్ హైమావతితో కలిసి ప్రారంభించారు. అలాగే ప్రిన్సిపల్ కంప్యూటర్ రూమ్‌ను ప్రారంభించారు. వెల్కటూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు నూతన ఇంటిని నిర్మించుకోవడంతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులను మంత్రి వివేక్‌వెంకట స్వామి శాలువాతో ఘనంగా సత్కరించి ఇంట్లో ఏర్పాటుచేసిన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి లబ్దిదారునికి స్వీట్ తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు డబ్బులను లబ్దిదారుల ఖాతాలో జమచేయడం జరుగుతుందని తెలిపారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. అనంతరం గ్రామ అభివృద్ధికి పలువురు మంత్రికి వినతిపత్రాలు అందజేయగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాలలో డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ సదానందం, జిల్లా రవాణాశాఖ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్ర వర్మ, పార్టీశ్రేణులు ఎం.డి.ఇమామ్(అత్తు), దేవుల పల్లి యాదగిరి, బొమ్మల యాదగిరి, సాకి అనంద్, గయాజుద్దీన్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

### పేదల సంక్షేమమే సర్కార్ ధ్యేయం...

**దుబ్బాక, జనవరి 13, ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను కాంగ్రెస్ సర్కార్ పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని కార్మిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకట స్వామి అన్నారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని 13,14,15,18 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించి రూ.10 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మెదక్ ఎంపి రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీకమిషన్ చైర్మన్ బక్కి వెంటకయ్య, జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కడెం లింగమూర్తి, ఆర్డీఓ సదానందం, దుబ్బాక ఎఎంసి చైర్మన్ కొంగర రవి, మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్‌కుమార్, డీసీసీ అధ్యక్షులు అంక్షరెడ్డి, నియోజకగ్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శంకుస్థాపనాలు చేశారు. అనంతరం దుబ్బాకలో ఏర్పాటు చేసిన నియోజకవర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు, నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయమన్నారు. గత బిఆర్ఎస్ సర్కార్ రాష్ట్రంలో రూ.8 లక్షల కోట్ల అప్పు మిగిల్చిందని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేకున్న చేసిన అప్పులకు రుణాలు కడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలో నూతన వృద్ధాప్య, వితంతు పింఛన్లు, రేషన్‌కార్డులు అందించడం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ సర్కార్ డబుల్ బెడ్ రూంల నిర్మాణం పేరుతో పేదలను మోసం చేసిందని అదే కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే గూడులేని అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదుకానీ కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులు మాత్రం వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి రూ.13 వేల కోట్లు ఖర్చుచేసి సన్న బియ్యం అందించడం జరుగుతుందన్నారు. దుబ్బాక మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని అవసరమైతే అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకవస్తానని తెలిపారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

### మార్కెట్ కమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

దుబ్బాక ఎఎంసి చైర్మన్‌గా కొంగరి రవి, వైస్ చైర్మన్‌గా బొంగరం బాల్‌రెడ్డి, తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చెరుకు విజయ్‌రెడ్డి(అమర్), వైస్ చైర్మన్‌గా కొంగరి నర్సింలు, మిరుదొడ్డి ఎఎంసి చైర్మన్‌గా బొమ్మెర సంయుక్త శ్రీధర్‌గుప్తా, వైస్ చైర్మన్‌గా చెన్నె భూపాల్‌గౌడ్, దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఐలాపురం కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్గఆ మద్దెల స్వామిలు మంత్రి వివేక్‌వెంకట స్వామి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.



ఇటుక బట్టీల యాజమానులకు నోటీసులు అందజేస్తున్న దృశ్యం

'వార్త'కు స్పందన

## ఇటుక బట్టీలకు నోటీసులు

**టేక్మాల్, జనవరి 13, ప్రభాతవార్త:** ఈనెల 7వ తేదీన టేక్మాల్‌లో ఇటుక బట్టీలు ఫుల్.. అనుమతులు నిల్..!.. అనే శీర్షికతో వార్త దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. టేక్మాల్ మండలంలో మొత్తం 25 ఇటుక బటీలు ఉన్నట్లు గుర్తించినట్లు తహసీల్దార్ తులసీరాం, గిర్దవర్ సాయి శ్రీకాంత్ చెప్పారు. ఈమేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూముల్లో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో ఇటుక బట్టీలను నెలకొల్పాలంటే దానిని వ్యవసాయేతర భూమిగా మార్చటంతోపాటు, రెవెన్యూ, భూగర్భ జలాలు, ఆటవీ, కాలుష్య నియంత్రణ, పంచాయతిరాజ్, తదితర శాఖల నుంచి అనుమతి పత్రాలను పొంది ఉండాలన్నారు. మండలంలో ఉన్న ఇటుక బట్టీల వ్యాపారులకు నోటీసులను అందజేసినట్లు గిర్దవర్ సాయి శ్రీకాంత్ తెలిపారు. నోటీసులు ముట్టిన మూడు రోజుల్లోనఇటుక బట్టీలకు సంబందించిన పత్రాలను కార్యాలయలనికి అందజేయలన్నారు. లేనిచో ప్రభుత్వ నిబంధనాల మేరకు శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నాచగిరి కార్యనిర్వహణాధికారిగా రంగాచారి

**వర్గల్, జనవరి 13 (ప్రభాతవార్త):** నాచారం శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా బెల్లంకొండ రంగాచారి బాధ్యతలు చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా న్యాగంజ్ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న రంగాచారికి వర్కింగ్ ఆర్డర్ ప్రకారం నాచారం దేవాలయానికి రావడం జరిగింది.

## ప్రజాబాటలో విద్యుత్ సమస్యల పరిష్కారం

**నర్సాపూర్ రూరల్, జనవరి 13,ప్రభాతవార్త:** ప్రజాబాటలో విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని నర్సాపూర్ ఏడి వెంకట్‌రామ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి చిన్నచింతకుంట గ్రామంలో ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో విద్యుత్ సమస్యల గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రజాబాటలో విద్యుత్ సమస్యలు ఎవైనా ఉంటే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం గృహజ్యోతి ధృవ పత్రాలను లబ్ధిదారులకు పంపిణి చేశారు. కార్యక్రమంలో సర్పంచి సరిత, ఉప సర్పంచి పెంటయ్య, యాదగిరి, నర్సింహారెడ్డి, లైన్ మెన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నచింతకుంటలో ప్రజాబాటలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

# ముంచుకొస్తున్న 'మున్సి'పోల్స్..!

* రిజర్వేషన్లపై ఎడతెగని ఉత్కంఠ
* ఆశావహుల్లో పెరుగుతున్న ఆశలు
* గెలుపుగుర్రాల కోసం పార్టీల వేట
* ప్రధాన సమస్య మెయిన్‌రోడ్డు వెడల్పు

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 13, ప్రభాతవార్త :** మున్సిపల్ 2వ సాధారణ ఎన్నికల నిర్వహణపై సోషల్ మీడియాలలో ఎన్నికల షెడ్యూల్ సంకేతాలు వెలువడుతుండటంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో రిజర్వేషన్ల ఖరారు అంశం ఆశావహుల్లో ఉత్కంఠను పెంచుతోంది. రిజర్వేషన్ రొటేషన్ కారణంగా కొన్ని స్థానాల్లో కొత్త ముఖాలకు అవకాశాలు పెరుగుతుండగా, మరికొన్ని చోట్ల సీనియర్ నేతలకు నిరాశ తప్పడం లేదు. మున్సిపల్ ఎన్నికలు స్థానిక రాజకీయాలకే కాకుండా రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపనున్న నేపథ్యంలో ఈ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలే ప్రధాన అజెండాగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక రామాయంపేట మున్సిపాలిటీలో రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం రోజు రోజుకీ ఉత్కంఠ భరితంగా మారుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే రంగంలోకి దిగడంతో పట్టణమంతా ఎన్నికల సందడితో కిటకిటలాడుతోంది. ఇప్పటికే టికెట్ల ఆశతో పలువురునేతలు పార్టీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గత పాలకమండలి పనితీరును ప్రజలు గమనిస్తున్న నేపథ్యంలో, అభివృద్ధి హామీలతో పార్టీలు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో ప్రచారం మరింత ఊపందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.



రామాయంపేట మున్సిపల్ కార్యాలయం

### అభ్యర్థుల ఖరారుపై కసరత్తు...

ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే వార్డు స్థాయిలో బలమైన అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో ఉన్నాయి. గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో పడ్డారు. స్థానికంగా పట్టున్న నేతలు, ప్రజల్లో గుర్తింపు ఉన్న యువ నాయ కులు, ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఆర్థికంగా పోటీలో తట్టుకునే నాయకులు, సామాజిక సమీకరణాలకు అనుగుణమైన అభ్యర్థులకోసం పార్టీల మధ్య పోటీ మొదలైంది. ఈసారి ఎన్నికల్లో ఓటర్లు కీలక పాత్ర పోషించనున్నారు. పట్టణ అభివృద్ధిపై స్పష్టమైన దృక్పథం కలిగిన నాయకత్వాన్ని ఎన్నుకోవాలనే చర్చ ప్రజల్లో మొదలైంది. ముఖ్యంగా యువత, మహిళలు ఎన్నికలపై ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులోనూ అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈ సమస్యలే ప్రధాన అజెండాగా మారనున్నాయి. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించే నిజమైన నాయకుడెవరో అన్నదానిపై చర్చించుకుంటూ, ఈసారి ఓటు విలువను గుర్తుచేసుకుంటున్నారు. మున్సిపల్ ఎన్నికలలో మెదక్ చౌరస్తా నుండి పట్టణంలోకి వెళ్లే ప్రధాన రోడ్డు సెంటర్‌పాయింట్‌గా మారనుంది. కొన్నేళ్లుగా రోడ్డు వెడల్పు చేపడాతమంటూ కాలం గడుపుతున్న రాజకీయ పార్టీలకు ఓటు ద్వారా ప్రజలు గట్టి సమాధానం చెబుతారన్న సంకేతాలు కనబడుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2వతేది అక్టోబర్ 2023 లో అప్పటి మంత్రి హరీష్‌రావు చేతులమీదుగా రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక...24వ తేదీ మార్చి, 2025 సంవత్సరంలో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేతులమీదుగా మరోసారి శంకుస్థాపన చేశారు. 40 ఫీట్ల కొలతతో రోడ్డు వెడల్పు చేసేందుకు మార్కులు చేసినప్పటికీ అది అక్కడే ఆగిపోయింది. అందుకే రానున్న ఎన్నికలలో ప్రజలు అన్ని రాజకీయ పార్టీలకు, స్థానిక నాయకులకు ఓటు ద్వారా సమాధానం చెబుతామని సోషల్ మీడియాలలోతో పాటు, బాహాటంగానే తమ వాణిని వినిపిస్తున్నారు.



మాట్లాడుతున్న మహేందర్

## రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలి

### -మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

**కౌడిపల్లి, జనవరి 13, ప్రభాతవార్త:** వాహనదార్లు రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. మంగళవారం కౌడిపల్లిలో ఎస్సై మురళి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా యువతకు ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'గమ్యానికి సజీవంగా చేరుకొండి' అనే పేరుతో పది రోజులపాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, లేనిపక్షంలో జరగకుడని ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగి తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం జరిగిపాతుందని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్‌బెల్టు ధరించి వాహనాలను నడపాలని ఆయన తెలిపారు. వాహన యజమాని జీవిత బీమా కల్గిఉండాలని ఆయన గుర్తు చేశారు. సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణాగౌడు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సదస్సుకు విచ్చేసిన వారందరితో రోడ్డు భద్రత ప్రమాణాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరమ్ మండల ఉపాధ్యక్షుడు బోయిని వీరయ్య, ప్రధాన కార్యదర్శి గోల్ల శేఖులుయాదవ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కౌడ శ్రీనివాస్‌గుప్తా, కుర్మ సంఘం నాయకులు కుర్మ లక్ష్మణ్‌యాదవ్, ఉడుత రాజుగుప్తా, నాండ్ల వెంకటేశంగుప్తా, సంతోష్‌గౌడ్, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, యువజన సంఘాల సభ్యులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## లకుడారం అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం

**కొండపాక, జనవరి 13, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండలం లకుడారం అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ బీట్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మాత్‌పల్లి, లకుడారం, మేదినిపూర్, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల ప్రజలు, రైతులు, పశువుల, మేకల కాపరలులు ఎవరూ అటు ఒంటరిగా వెళ్లవద్దని అయన హెచ్చరించారు. లకుడారం అటవీ ప్రాంతంలో చిరుతపులి పాదముద్రలు కనిపించాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా లకుడారం సర్పంచ్ శిల్ప నర్సింలుకు ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తు గ్రామస్తులకు తెలియజేయాలని అయన కోరారు. సర్పంచ్ గ్రామంలో సౌండ్ సిస్టమ్ ద్వారా చిరుతపులి సంచారిస్తు్న విషయాన్ని ప్రజలందరికి తెలియజేశారు.

## ఉల్లి..రైతులకు "కన్నీ"రే..

### తగ్గుతున్న సాగు విస్తీర్ణం

**నారాయణఖేడ్, జనవరి 13 ప్రభాతవార్త :** నారాయణఖేడ్ నియోజకవర్గం వరి, పెసరు, జొన్న, వేరుశనగ, పత్తితోపాటు ఉల్లి అధికంగా సాగు చేస్తారు. పంట సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగితే రైతులకు నష్టం .. వేయకుంటే సామాన్య రైతులకు భారం. అయితే దళారుల మాయాజాలంలో అత్యధికంగా నష్టపోయేది మాత్రం రైతన్నలే. గత సంవత్సరం ఉల్లి పంటను సాగుచేసిన అన్నదాతలు నష్టాల బారినపడ్డారు. ఈ ఏడాది అదే పరిస్థితి ఉంటుందన్న అపోహతో చాలా మంది రైతులు ఉల్లి సాగు పట్ల ఆసక్తి చూపలేదు. దీంతో ధర పెరిగినట్లే పెరిగి పంట చేతికి వచ్చే సమయంలో పడిపోయి వ్యాపారుల చేతికి వెళ్లిపోయి ధరలు పెరిగిపోవడం సాధారణం అయిపోయిది. ఉల్లి సాగు విస్తీరణం తగ్గడంతో రూపాయలు 25 నుండి 30 వరకు పలుకుతుంది. ఖేడ్ ప్రాంతంలో ఉల్లి సాగు చేసే రైతులు గతంలో ఎక్కువ మంది ఉండేవారు. పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గి నష్టాలు వస్తుండడంతో పంట సాగు పట్ల రైతులు ఆసక్తి చూపడంలేదు చూపడం లేదు . ఖేడ్ ప్రాంతానికి కర్ణాటక , మహారాష్ట్ర ప్రాంతం సరిహద్దు కావడం తో ధరలపై ప్రభావం పడుతుంది. అయితే అత్యధికంగా నారాయణఖేడ్ ప్రాంతం లో ఉల్లి సాగు జరిగి నప్పటికీ, నిల్వచేసే కేంద్రాలు లేక పంట ఎక్కడ భారమవుతుందో అని ఎంతకాంతకు ప్రస్తుతం ఉల్లి దాళారులకు విక్రహిస్తుంటారు. ప్రస్తుతం ఉల్లి దార తక్కువ ఉండడంతో రైతులు పండించిన దాని కంటే తక్కువ ధరకు ఉండంతో అన్నదాతలు నష్ట పోయే పరిస్థితి దాపురించింది . ఏది ఏమైనా ప్రభుత్వం స్పందించి ఉల్లి కనీసం దర పలికేలా చూడాలని ఖేడ్ ప్రాంత రైతన్నలు కోరుతున్నారు.



## గుండెపోటుతో మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి కన్నుమూత

**చౌటకూరు, జనవరి 13, ప్రభాతవార్త:** మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం ఉమ్మడి పుల్‌కల్ మండల అధ్యక్షుడు బక్కారెడ్డి కిష్టారెడ్డి(53) గుండెపోటుతో సంగారెడ్డిలోని నివాసంలో సోమవారం రాత్రి మృతి చెందారు. రాత్రి భోజనం చేస్తుండగా గుండెపోటు రావడంతో వెంటనే సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే కిష్టారెడ్డి మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికలో సర్పంచ్‌గా ప్రజలు ఎన్నుకున్నారు. 2006లో ఉప సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించి గ్రామాభివృద్ధికి తన వంతు సేవలు అందించారు. మంగళవారం జరిగిన అంతక్రియల్లో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ పట్లోళ్ల మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి, బిఆర్ఎస్ నాయకులు ఉదయ్, బాబుమోహన్, పుల్‌కల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గారెడ్డి, బిజెపి నాయకులు చంటి ప్రభు, పట్లోళ్ల జైపాల్‌రెడ్డి, కిష్టారెడ్డి తదితరులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి

**నర్సాపూర్ రూరల్, జనవరి 13,ప్రభాతవార్త:** చేపలు పట్టడానికి వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తుజాల్‌పూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీశైలం(45), స్థానికంగా ఉన్న చెరువులో చేపలు పట్టడానికి వెళ్లేవాడు. ఎప్పటిలాగానే మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు చేపలు పట్టడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి దారచెరువుకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. ఇది గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెరువులో గాలించడంతో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

## పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న డిప్యూటీసీఎం భట్టివిక్రమార్క, ప్రెసిడెంట్ రత్నాకర్‌రావు, సెక్రటరీ జనరల్ సదానందం, జనప్రియ, సురేష్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ -2026ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈమేరకు మంగళవారం అసోసియేషన్ ప్రెసిడెంట్ రత్నాకర్‌రావు, జనరల్ సెక్రటరీ సదానందంలో ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం డిప్యూటీ సిఎంని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అనంతరం డైరీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పవర్ సెక్టర్ లో పనిచేస్తున్న ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించగా సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ జనప్రియ, అడిషనల్ జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, రమేష్, వెంకటేశ్వర్, బ్రహ్మజీ, సురేష్ కుమార్, శ్రీనివాసరెడ్డి, సామ్య నాయక్, కిరణ్ కుమార్, గోపాల్ రావు, విద్యాసాగర్, సత్యనారాయణ రాజు, కిషోర్ కుమార్, తిరుపతి, సురేష్ బాబు, పివిరావు, అశోక్ కుమార్, యుగంధర్, బ్రహ్మజీ, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## అంజయ్యకు స్వామి వివేకానంద విశిష్ట పురస్కారం



అంజయ్యకు పురస్కారం అందజేస్తున్న వేణుగోపాలచారి, దైవజ్ఞశర్మ తదితరులు

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాపకంటి అజయ్యకు స్వామి వివేకానంద పురస్కారం లభించింది. ఈమేరకు వివేకానంద 163 వ జయంతి పురస్కరించుకుని మెగాసిటీ నవకల వేదిక- మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్‌తో జరిగిన కార్యక్రమంలో స్వామి వివేకానంద విశిష్ట పురస్కారం కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి గారి చేతుల మీదుగా అందుకున్నారు. ముఖ్యంగా ఒవైపు ఉద్యోగంలో రాణిస్తూనే పాపకంటిఅంజయ్య చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు అయిన అనాథ పిల్లల ఆశ్రయం కోసం, చదువుల కోసం సహాయం, విద్యుత్ ప్రమాదం వలన ఇల్లు కోల్పోయిన వారికి నూతన గృహ నిర్మాణం చేయించి ఇవ్వడం, అలాగే అనేక మంది వైద్య సదుపాయాల కోసం వారు చేయూత అందించడం వంటి కార్యక్రమాలు గుర్తించిన మెగాసిటీ నవకల వేదిక మరియు మదర్ ఫౌండేషన్ సభ్యులు వీరిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, డాక్టర్ టీ. ఆనంద మూర్తి, మాజీ ప్రభుత్వ న్యాయవాది డి.ఎల్ పాండు, అడ్వకేట్ సీ హెచ్ రఘురామారావు, కంజర్ల ఈశ్వరా చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేస్ ఎంపీ కాలనీలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేస్ ఎంపీ కాలనీ వాసులు.

**జూబ్లీహిల్స్, జనవరి 13, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేస్ ఎంపీ కాలనీలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కాలనీలోని ఎంపీఎస్ ఎమ్మెల్యే కల్చరల్ సెంటర్‌లో ఈ వేడుకలను నిర్వహించారు. వేడుకలను కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు ఇనుగాల పెద్దిరెడ్డి, కార్యదర్శి రాగిడి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు, యువతులు ఇక్కడ నిర్వహించిన వేడుకలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా రంగవల్లుల పోటీలను నిర్వహించగా మహిళలు ఈ వేడుకలో పెద్దసంఖ్యలో పాల్గొని సంక్రాంతి రంగవల్లులను తీర్చిదిద్దారు. ముచ్చటైన ముగ్గులు వేసిన కాలనీ మహిళలకు నిర్వాహకులు బహుమతులను అందించారు. మరోవైపు కైట్ ఫెస్టివల్‌లో చిన్నారులు, పెద్దలు కలిసి పతంగులను ఎగురవేశారు. గంగిరెడ్డుల విన్యాసాలు, సంక్రాంతి పిండివంటల ఘుమఘుమలతో ఇక్కడంతా పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎంటర్‌టైన్‌మెంట్ కన్వీనర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యవాదులు ట్రంప్‌ను పదవి నుంచి తొలగించాలి

**సైఫాబాద్, జనవరి 13 ప్రభాతవార్త:** అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు, చర్యలు ప్రపంచానికి, ప్రజల మనుగడకు తీవ్రమైన ప్రమాదకరంగా ఉన్నాయని, ఆయన అధ్యక్షుడిగా కొనసాగే అర్హత లేదని సిపిఐ రాష్ట్ర సమితి కార్యవర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ హెచ్చరించారు. స్వతంత్ర దేశమైన వెనుజుల అధ్యక్షుడు మధరోని, అతని భార్యతో సహా కిడ్నాప్ చేయడాన్ని ప్రపంచంలో అతిపెద్ద నేరమైన చర్యగా భావిస్తూ ప్రపంచ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని ఆయన తెలిపారు. ఇంత జరిగినా ప్రధాన నరేంద్రమోదీ తన తీరును, ప్రవర్తనను మార్చుకోకపోవడం అతి దారుణమైన సంఘటన అని ఆరోపించారు. ట్రంప్ వెనుజుల అధ్యక్షుడినని ప్రకటించుకోవడంతో ఆయనకు మతి స్థిమితంగా ఉందా?, లేదా? అన్న అనుమానం ప్రజల్లో కలుగుతున్నదని, వెనుజుల కోర్టు ఆదేశాల ప్రకారం ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెలి స్రోడ్రిగ్జ్ అధ్యక్షురాలిగా భాధ్యతలు స్వీకరించినప్పటికి ట్రంప్ నూతనంగా పదవి చేపట్టిన అధ్యక్షురాలిని కూడా బెదిరించడం అతని అహాంభావానికి నిదర్శనమని విమర్శించారు. అమెరికాలో హంతకుడు, ప్రపంచ నియంత అయిన ట్రంప్‌ను పదవి నుంచి తొలగించాలని ఆ దేశంలోని ప్రజాస్వామ్యావాదులందరికి ఆయన విజ్ఞప్తి చేశారు.

## బాలల సంగీత నృత్య సంరంభం



ప్రముఖ నటుడు జి సి రెడ్డిలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి జనవరి 13 ,ప్రభాతవార్త :** శివాని ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహణ లో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక స్వామి వివేకానంద జయంతి వేడుకలు జనగామ గౌతం మోడల్ స్కూల్ విద్యార్థుల సంగీత నృత్య సమరంభం గా జరిగాయి స్వామి వివేకానంద సందేశం సూక్తులు బాలల ప్రదర్శనలలో చోటు చేసుకున్నాయి ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ప్రముఖ నటుడు జి సి రెడ్డి నీ నెల్లుట్ల ఫౌండేషన్ స్థాపక అధ్యక్షుడు నెల్లుట్ల రవీందర్ రావు గౌతం మోడల్ స్కూల్ కరస్పాండెంట్ మోతే సురేందర్ రెడ్డి శివాని సంస్థ స్థాపకుడు పరమేశ్వర్ కలసి సత్కారం చేసారు అతిథులు మాట్లాడుతూ స్వామి వివేకానంద అధ్యాత్మిక భావన లు సామాజిక దృక్కోణం కలిగి ఉంటాయి ఆయన సూక్తులు శక్తి వంటి సత్యాలు వాటిని ప్రతి భారతీయ పౌరుడు నిబద్ధత గా పాటించాలి అన్నారు వేదిక పై సంస్థ ప్రధాన కార్యదర్శి శివమన్నారాయణ,వనం కవిత బాబా అర్చన తదితరులు పాల్గొన్నారు

## డ్రగ్స్ తరహాలో చైనా మాంజాపై ఉక్కుపాదం : ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్



గాలిపటాలను పంపిణి చేస్తున్న రాజేంద్రనగర్ సిఐ ముత్తుయాదవ్, తెలంగాణ విద్యార్థి జెఎసి చైర్మన్ వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్, జనవరి 13 ప్రభాతవార్త** గంజాయి, డ్రగ్ తరహాలో చైనా మాంజా విక్రయించినా, వాడినా కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్ అన్నారు. మంగళవారం తెలంగాణ విద్యార్థి జెఎసి చైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో గాలిపటాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్టు చప్పుడు కాకుండా పలుచోట్ల చైనా మాంజా విక్రయిస్తున్నారని, దీనివల్ల మనుషులకు జీవరాసులకు ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు.చైనా మాంజా ఒక మారణ ఆయుధం ద్విచక్ర వాహనదారులకు గొంతులు తెగుతున్నాయి, పాదాచారులు నడుచుకుంటూ వెళుతున్న సమయంలో కాళ్లకు చిక్కుకొని కింద పడుతున్నారు గాయాల పాలవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలన్నారు. సంక్రాంతి సందర్భంగా గాలిపటాలు ఎగరేసేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చైనా మాంజాను ఎవరు కొనవద్దని, చైనా మాంజా వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. మరి ముఖ్యంగా తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని,ఎట్టి పరిస్థితుల్లో చైనా మాంజాను వాడరాదని కోరారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, స్థానిక నాయకులు యాదయ్య, మంగళవారం శ్రీనివాస్, వేముల రమేష్, రఘు ముదిరాజ్, పంబాల రాజు, నరేష్, నరసింహా రాజు ,శ్రీనివాస్ దయాకర్, మోహన్, చింటూ, వేణు, లల్లు, మోక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలి : ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు



ప్రసంగిస్తున్న చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏడుకొండలు

**చిక్కడపల్లి జనవరి 13 ప్రభాతవార్త :** రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏడుకొండలు సూచించారు. మంగళవారం నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ రాజు నాయక్, సబ్ ఇన్సె పెక్టర్ మోనిక, ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ యాదగిరి, శ్రీకర హాస్పిటల్స్ ప్రతినిధి డాక్టర్ రాకేష్, స్థానిక యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం, అతి వేగాన్ని నియంత్రించడం, డ్రంకెన్ డ్రైవింగ్ మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, అతివేగం, సిగ్నల్ జంపింగ్ మరియు మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారిపై జరిమానాలు విధించడం, జీబ్రా క్రాసింగ్‌ల వద్ద వాహనాలు ఆపడం మరియు పాదచారులకు మార్గం సుగమం చేయడంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించి, సురక్షితమైన ప్రయాణానికి సహకరించాలని కోరారు.

## సామాజిక ప్రయోజనం కోసం సినిమాలు తీసిన తిలక్ : పాలకుర్తి మధుసూధన రావు



కార్యక్రమంలో పాల్గొన్న దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ పాలకుర్తి మధుసూధన రావు, ప్రొఫెసర్ డాక్టర్ త్రిపురనేని రాజారావు,

**చిక్కడపల్లి జనవరి 13 ( ప్రభాతవార్త ) :** సమాజిక ప్రయోజనం కోసం సినిమాలు తీసిన వ్యక్తి కెబి తిలక్ అని దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ పాలకుర్తి మధుసూధన రావు అన్నారు. మంగళవారం రాత్రి కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాత కె.బి.తిలక్ శతజయంతి మహోత్సవం సభ మంగళవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభ లోని కళా సుబ్బారావు కళావేదిక లో జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ పాలకుర్తి మధుసూదన రావు మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో సామాజిక స్పృహ ఉన్న దర్శకుడిగా, నిర్మాతగా ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. కేవలం వినోదం కోసం కాకుండా, సమాజం లోని రుగ్మతలను ఎత్తిచూపుతూ ఆయన సినిమాలు తీశారని అన్నారు. కార్యక్రమంలో మహేంద్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ త్రిపురనేని రాజారావు, సినీ విజ్ఞాన విశారద యస్.వి.రామారావు, నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురాం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయకులు వై.ఎస్.రామకృష్ణ బృందంచే కె.బి.తిలక్ సినిమాలలోని పాటల సంగీత విభావరి నిర్వహించారు.

## యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి : ఎంపి ఈటల రాజేందర్



ఎంపి ఈటలను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

**నాచారం, జనవరి 13 ప్రభాతవార్త :** గత మూడు రోజులుగా నాచారం డిపీఎస్‌లో నిర్వహిస్తున్న అస్మిత యోగాసన జోనల్ లీగ్ ముగింపు ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ, డీపీఎస్ ప్రో చైర్మన్ మల్కా కొమరయ్య, పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి లక్ష్మీకాంత్ రాథోడ్, తెలంగాణ యోగాసన భారత్ అధ్యక్షులు శ్రీధర్ రావు, తెలంగాణ యోగాసన జనరల్ సెక్రటరీ నందనం కృపాకర్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ యోగాసన పోటీల్లో విజేతలుగా నిలిచిన బృందాలకు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించి, వారి ప్రతిభను కొనియాడారు.అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, నేటి ఆధునిక బిజీ జీవనశైలిలో యోగా ఎంతో కీలకమని అన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను అందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో యోగాకు విశేష ప్రోత్సాహం లభించిందని, అంతర్జాతీయ స్థాయిలో యోగాకు గుర్తింపు తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది యోగా క్రీడాకారులు, కోచ్‌లు, న్యాయమూర్తులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారు. యోగాసనాల ద్వారా యువత ఆరోగ్యవంతంగా ఎదగాలని, భవిష్యత్తులో ఇలాంటి పోటీలు మరింత విస్తృతంగా నిర్వహించాలని నిర్వాహకులు తెలిపారు.

## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు : ఇంద్రపాల్ రెడ్డి

**-హోదా మార్చి మాట్లాడితే ప్రజలే బుద్ధి చెపుతారు**



**అత్తాపూర్ జనవరి13,ప్రభాతవార్త :** నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకుడిపై కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఇంద్రపాల్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం కాంగ్రెస్ నేత ఇంద్రపాల్ రెడ్డి మాట్లాడుతూ.... కార్పొరేటర్ హోదాలో ఉన్న వ్యక్తి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు తమ స్థాయి, భాష మరియు సంస్కారాన్ని గుర్తుంచుకుని మాట్లాడాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని నాలుగు సార్లు గెలిపించిన ప్రజల తీర్పు, ఆ నాయకుడిపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని ప్రజల మద్దతు లేకుండా ఎవరూ పదవుల్లో నిలబడలేరు అనే వాస్తవాన్ని గుర్తించాలని నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శాసనసభలోనూ, ప్రభుత్వ స్థాయిలోనూ నిరంతరం పోరాటం చేసిన విషయం ప్రజలందరికీ తెలుసు అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని హైదరాబాద్‌లో విలీనం చేస్తారన్న అంశంపై ఎలాంటి అధికారిక జీవో రాకముందే, మొదటిగా రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపిన నాయకుడు ఎమ్మెల్యే గారే. ప్రజల హక్కుల కోసం ఆయన పోరాటం నిరంతరం కొనసాగిందని లేని జీవోల గురించి, ఆధారంలేని లీకుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించడం బాధ్యతారాహిత్యానికి ఉదాహరణ అన్నారు. రంగారెడ్డి జిల్లా నాయకులు సమిష్టిగా ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వగా, సీఎం కూడా ప్రజలకు అన్యాయం జరగనివ్వనని స్పష్టంగా తెలిపారు. ప్రజా ప్రతినిధులు ఎవరి మెప్పుకోసం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారానికే పని చేయాలన్నారు. అన్ని మతాలను గౌరవించడం దేశ సంప్రదాయం. మతపరమైన వ్యాఖ్యలతో సమాజంలో విభేదాలు సృష్టించడం బాధ్య తాయుత రాజకీయానికి విరుద్ధమని సంబంధిత కార్పొరేటర్ తన వ్యాఖ్యలపై పునరాలోచన చేసి, భవిష్యత్తులో బాధ్యతాయుతంగా, గౌరవప్రదంగా మాట్లాడాలని సూచించారు. లేకపోతే ప్రజలు తగిన రీతిలో బుద్ధిచెపుతారన్నారు.

## గ్రామాలాభివృద్ధిలో కార్యదర్శులదే కీలక పాత్ర : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**అత్తాపూర్ జనవరి13,ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పనిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శంషాబాద్ మండలానికి చెందిన 21 గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి కనీస సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు.గ్రామాల్లోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లోని నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం మరియు భూగర్భ జలాల పెంపునకు దోహదపడే ఇంకుడు గుంతల నిర్మాణం గురించి ఆరా తీసి, వాటి పురోగతిపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు మరియు సేవలు నేరుగా ప్రజలకు అందేలా చూడటంలో కార్యదర్శులు వారధిలా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో శంషాబాద్ ఎంపీడీవో ముని,ఎంపీఓ రమేష్ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు..

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు రద్దు చేయాలి.. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి

**న్యాయ, ప్రజా పోరాటాలను నిర్వహిస్తాం: బిసి నేతలు హెచ్చరిక**



హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్, విశారధన్, విజయ్‌కుమార్‌గౌడ్, వెంకన్నగౌడ్, నారాయణగౌడ్ తదితరులు

**సైఫాబాద్, జనవరి 13 ప్రభాతవార్త:** అగ్రవర్ణ పేదలకు కేంద్ర ప్రభుత్వం కల్పించిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు రాజ్యాంగ విరుద్ధమని, దీనిపైన న్యాయ పోరాటం, ప్రజా ఉద్యమం చేపడతామని పలువురు బిసి నాయకులు హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, బిసిలు 86 శాతం ఉన్నారని, అగ్రవర్ణాలు కేవలం 4, 5 శాతం మాత్రమే ఉన్నారని, తామంతా ఐక్యంగా రిజర్వేషన్‌లను రద్దు కోసం ఉద్యమిస్తామని వారు తెలిపారు. బిసి మేధావుల ఫోరం, బిసి పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'సమర్ధ గ్రామ పాలనకు- సర్పంచుల హ్యాండ్ బుక్'ను ఫోరం కన్వీనర్ చిరంజీవులు, ఫ్రంట్ కన్వీనర్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ, బిసి జెఎసి కన్వీనర్ విశారధన్ మహారాజ్ తదితరులు ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 18వ తేదీన హైదరాబాద్ నగరంలో ఒక సమావేశాన్ని నిర్వహిస్తామని, అగ్రవర్ణాలు ఒక లక్ష మంది జనాభాతో సభను ఏర్పాటు చేస్తే, తాము కోట్లాది మందితో పెరెడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయించాలని పార్లమెంట్ సభ్యులందరికి వినతి పత్రాలను అందిస్తామని, జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేస్తామని, పార్లమెంట్‌లో 9వ షెడ్యూల్డ్‌లో పెట్టెంతవరకు ఉద్యమిస్తామని, 2028 లో రాజ్యాధికారాన్ని సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. అగ్రకులాల దుశ్చర్యలను, కుట్రలను ఎదుర్కొంటామని, పది రోజుల్లో న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రకటించిన ఎఐసిసి నేత రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, తాము ఏలాంటి హామీ ఇవ్వలేదని బిజెపి చేతులు దులుపుకుంటున్నదని, బిఆర్‌ఎస్ నేతలు కెసిఆర్, కెటిఆర్ నిద్రపోతున్నారని వారు ధ్వజమెత్తారు. బిసిలకు రిజర్వేషన్‌లు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉందని వారు స్పష్టం చేశారు. ఈ హ్యాండ్ బుక్ ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా సర్పంచ్‌లు చదవాలని వారు సూచించారు. ఈ సమావేశంలో బిసి నేతలు అయిలి వెంకన్న గౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ : కార్తీక్ రెడ్డి



**అత్తాపూర్ జనవరి13,ప్రభాతవార్త :** సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జీ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులను బిఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ముగ్గల పోటీలో పాల్గొన్న అందరికి కార్తీక్ రెడ్డి బహుమతులు అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ...నియోజకవర్గం ప్రజలకు భోగి సంక్రాంతి కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ప్రజల జీవితంలో నిత్యం వెలుగు వెరిజిల్లాలని ఆ దేవుని కటాక్షం ప్రజలపై ఉండాలని,ఆనందంగా పండగలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధముగా సంక్రాంతి పర్వదినం సందర్భంగా ముగ్గల పోటీలు నిర్వహించడం పట్ల వెంకటేష్ నుఅభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి. రమేష్ ముదిరాజ్ నోముల రాము యాదవ్ అక్కేమ్ రఘు యాదవ్ బండ రాజేష్ యాదవ్ ఉప్పల్ శ్రీను ప్రవీణ్ సన్నీ సునీల్ పోతరాజు రమేష్ , కే. లక్ష్మీ , సరిత , భూదేవి రెడ్డి , సుగుణమ్మ, లక్ష్మి ప్రసన్న, పుష్ప, లలిత, శిరీష, సారిక, కృష్ణవేణి , మైసిరెడ్డి గంజి రాజు సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఎర్లపల్లి ప్రవీణ్ మహేందర్ ముదిరాజ్ కొంపల్లి జగదీష్ నరేష్ యాదవ్ అశోక్ నానీ మధు చారి కృష్ణ ముదిరాజ్ నాయకులు కార్యకర్తలు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ముఖ్యం : ఎసిపి హరిప్రసాద్



ఎరైవ్-ఎలైవ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ కట్టా హరిప్రసాద్.

**జూబ్లీహిల్స్, జనవరి 13, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పశ్చిమ మండల ఏసీపీ కట్టా హరి ప్రసాద్ అన్నారు. డీజీపీ శివధర్‌రెడ్డి, కమిషనర్ సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం 'ఎరైవ్-ఎలైవ్' ప్రచార కార్యక్రమంలో భాగంగా కమలాపురి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఒకరు చేసిన తప్పుకు మరొకరు బలవుతున్నారని, కొన్నిసార్లు ఒక్కప్రమాదంలోనే పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ఎరైవ్-ఎలైవ్ కార్యక్రమాన్ని ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో, అందరి భాగస్వామ్యంతో నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ఏటా 27వేల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారన్నారు. వీటిని నివారించేందుకు పోలీసు శాఖతోపాటు ప్రజలు, విద్యార్థులు, నాయకులు ఇలా ప్రతి ఒక్కరూ మమేకం కావాలన్నారు. అందరి సహకారంతోనే, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్లనే ఇది సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీత యాదవ్, అసోసియేసన్ అధ్యక్షుడు విజయమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రావులతోపాటు కాలనీవాసులు, విద్యార్థులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

## చౌమొహల్లా ప్యాలెస్‌లో ప్రఖ్యాత సూఫీ గజల్‌గాయని అనితా సింఘ్వీ గజల్ కచేరి

**-రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు డా. అలేఖ్య పుంజాల**

**నాంపల్లి, జనవరి 13 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ప్రఖ్యాత అంతర్జాతీయ సూఫీ గజల్ గాయని అనితా సింఘ్వి ఈ నెల 17 శనివారం సాయంత్రం 6.30లకు చౌమొహల్లా ప్యాలెస్‌లో గజల్ కచేరి నిర్వహించనున్నట్లు తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు, ప్రముఖ నాట్యగురువు డా. అలేఖ్య పుంజాల తెలిపారు. ఈమేరకు మంగళవారం మీడియా వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. గ్వాలియర్ ఘరానా గజల్ గాయనిగా భారతదేశంతోపాటు యూరప్, అమెరికా తదితర దేశాల్లో ప్రసిద్ధి చెందారని అలేఖ్యపుంజాల వివరించారు. ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో సంగీత గజల్ ప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ఆసాంతం ఆస్వాదించి విజయవంతం చేయాలని కోరారు.

## బిసిల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**-మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పొన్నం ప్రభాకర్, ఆనంద్‌గౌడ్, ముఖేష్‌గౌడ్, మహేష్‌గౌడ్, వినయ్‌కుమార్ గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి నూతన సంవత్సర క్యాలెండర్ ను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుపుతూ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తాళ్ళ ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి బుడంపల్లి నిరంత్ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు కాసుల మహేష్ గౌడ్, గోపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తిని వినయ్ కుమార్ గౌడ్, రామకృష్ణ, ఎల్గాని వెంకటేష్ గౌడ్, గణేష్ గౌడ్ పాల్గొన్నారు.

## సాలార్‌జంగ్ మ్యూజియంకు రెండురోజులు సెలవులు

**చార్మినార్ జనవరి13,ప్రభాతవార్త**

సాలార్ జంగ్ మ్యూజియంకు వరుసగా రెండు రోజులు సెలవులు మ్యూజియం అధికారులు ప్రకటించారు. ఈనెల15వ తేదిన సంక్రాంతి పండుగ కావటంతో సెలవు కాగా ప్రతీ శుక్రవారం సాలార్ జంగ్ మ్యూజియంకు సెలవు ఉంటుంది.దింతో వరసగా రెండురోజులు మ్యూజియంకు సెలవులు రావటంతో తిరిగి సాలార్ జంగ్ మ్యూజియంను 17వ తేదీ శనివారం తెరవనున్నారు.

## 16న సిఎం ప్రజావాణి 20కి వాయిదా

**బేగంపేట జనవరి 13,ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఈ నెల 16వ తేదీ (శుక్రవారం)న నిర్వహించనున్న ప్రజావాణీ కార్యక్రమం కనుమ పండుగ సందర్భంగా 20వ తేదీ(మంగళవారం)కి వాయిదా వేసినట్లు ప్రజాభవన్ అధికారులు తెలియజేసారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి జనవరి 16వ తేదీ (శుక్రవారం)కాకుండా జనవరి 20వ తేదీ (మంగళవారం) న ప్రజావాణీ కార్యక్రమానికి హాజరు కావాలని అధికారులు తెలియజేసారు.

## రాజేంద్రనగర్‌లో చైనా మంజా పట్టివేత



**అత్తాపూర్ జనవరి13,ప్రభాతవార్త :** కిస్మత్‌పూర్, బండ్ల గూడా, హైదర్‌గూడా ప్రాంతాలలో గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్న సింథటిక్ చైనా మంజాను రాజేంద్రనగర్ పోలీసులు పట్టుకున్నారు.సిఐ ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ వివరాలు ప్రకారం...హైదర్‌గూడలోని పిల్లర్ నెంబర్ 143 సమీపంలోని రామ్‌దేవ్ గిఫ్ట్‌షాపుతో పాటు పలు ప్రాంతాలలో నిషేధిత సింథటిక్ మంజా అక్రమ అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి మంజా స్వాధీనం చేసుకోవడంతో పాటు జీతా రామ్(22) అనిల్ కుమార్ (23) జగదీష్ చౌదరి (22)లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పక్షులతో పాటు మనుషులకు చైనా మంజాతో ప్రమాదం పొంచి ఉందని కావున చైనా మంజాను ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదని పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా అమ్మిన వాడిన 100 కు డయాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ సూచించారు.

## మెడికల్ షాప్స్‌పై డిసిఎ అధికారుల రైడ్స్

**జీడిమెట్ల, జనవరి 13 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు మెడికల్ షాప్స్‌పై డ్రగ్‌కంట్రోల్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనిఖీలలో బ్రాండెడ్ లేబుల్స్‌తో నకిలీ మందులు లభ్యమవడం కలకలం రేపింది. దుర్గా మెడికల్ అండ్ జనరల్ స్టోర్ దుకాణంలో బ్రాండెడ్ లేబుల్స్‌తో నకిలీ మూర్ఛవ్యాధి నివారణ టాబ్లెట్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. క్యూఆర్‌కోడ్, ప్యాకింగ్‌లో మార్పులు ఉండటంతో నకిలీ బాగోతం బయపడింది. నకిలీ మందులను సీజ్ చేసిన అధికారులు దుకాణం యజమాని మల్లికార్జున్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

## సినీదర్శకుడి కుమారుడిని మోసగించిన దంపతులు

**- ట్రేడింగ్ పేరుతో రూ. 72లక్షలు మోసం**

**జూబ్లీహిల్స్, జనవరి 13, ప్రభాతవార్త:** ట్రేడింగ్ పేరుతో సినీ దర్శకుడి కుమారుడిని ఒక దంపతులు రూ. 72 లక్షలు మోసగించిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సినీ దర్శకుడు ధర్మ తేజ(తేజ) కుమారుడు అమితవ్ తేజకు సనత్ నగర్ ప్రాంతానికి చెందిన దంపతులైన యార్లగడ్డ అనూష, కొండపనేని ప్రణీత్‌లతో 2025 ఏప్రిల్‌లో పరిచయం ఏర్పడింది. ట్రేడింగ్‌లో లాభాలు కల్పిస్తామంటూ వారిద్దరు ఆయనను నమ్మించారు. అతని వద్ద నుంచి రూ 63 లక్షలు తీసుకున్నారు. కొద్ది నెలలకే రూ. 9 లక్షలు లాభాలు వచ్చాయన్నారు. లాభాలు రాకుంటే సనత్ నగర్‌లో తమకున్నటువంటి డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్‌ను ఇస్తామంటూ ఎంవోయూ చేసుకున్నారు. చాలా రోజులుగా మాయ మాటలు చెపుతూ అసలు, లాభాలు ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన అమితవ్ తేజ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్

## ఓటర్ల జాబితా విడుదల

**నర్సాపూర్, జనవరి 13, ప్రభాతవార్త:** తుది ఫొటో ఓటర్ల జాబితాను మున్సిపల్ కమిషనర్ రామ్‌చరణ్‌రెడ్డి విడుదల చేశారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు సంబంధించిన తుది ఫొటో ఓటర్ల జాబితాను మున్సిపల్ కమిషనర్ రామ్‌చరణ్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం ఓటర్లు 16,876 మంది ఉండగా ఇందులో 8219 మంది పురుషులు, 8656 మంది మహిళలు, ఇతరులు 1 ఓటర్లు ఉన్నారని ఆయన తెలిపారు. జాబితాను మున్సిపల్, ఆర్డీవో, తహసీల్దార్‌కార్యాలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వార్డు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

**హుస్నాబాద్ రూరల్, జనవరి 13, ప్రభాతవార్త :** ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని మండల ప్రజాపరిషత్ అధికారి గుగులోతు మోహన్‌నాయక్ అన్నారు. మంగళవారం కూచంపల్లి గ్రామంలో సాహస్ ఎన్జీవో ఆధ్వర్యంలో, సిజిఐ సౌజన్యంతో క్లీన్ అప్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మోహన్‌నాయక్ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంతోపాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి పంచాయతీ వాహనానికి అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయడం, కాల్చడం చట్టరీత్యా నేరమని, తడి చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేసుకోవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపించాలని, హానికరమైన చెత్తను సైంటిఫిక్ పద్ధతిలో ల్యాండ్‌ఫిల్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మ జైపాల్‌రెడ్డి, సాహస్ ఎన్జీవో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఇటీకాల చిన్న, ఎన్జీవో సూపర్వైజర్లు బాలరాజు గౌడ్, వేల్పుల సంపత్, లింగాల వినీత్, ప్రవినేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## స్వామివారి నిత్య అన్నప్రసాదానికి విరాళం



స్వామి వారి చిత్ర పటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

**కొమురవెల్లి, జనవరి 13, ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి నిత్య అన్నప్రసాద వితరణ స్కీంలో సిద్దిపేట కాళ్లకుంట కాలనీకి చెందిన రచ్చ భాస్కర్ అనిత దంపతులు రూ.100116 విరాళంగా ఆలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్ అందించారు. ఈ సందర్భంగా వారికి స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని, ఆశీర్వచనాన్ని అర్చకులు అందించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే



సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

**కొండపాక, జనవరి 13, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధితోపాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంటా నర్సారెడ్డి అన్నారు. మంగళవారం కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారం, ముద్దాపూర్, మంగోల్, కానాయిపల్లి గ్రామాల్లోని ఎస్సీల కాలనిల్లో అర్‌సిసి నిధులతో నిర్మించే సిసి రోడ్ల నిర్మాణం పనులకు ఆయన కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే రోడ్ల సౌకర్యం ఉండాలన్నారు. ముద్దాపూర్‌కు రూ॥ 5 లక్షలు, కోనాయిపల్లికి రూ॥ 5 లక్షలు, లకుడారంకు రూ॥ 10 లక్షలు, మంగోల్‌కు రూ॥ 20 లక్షల అర్‌సిసి నిధులు ప్రభుత్వం నుండి మంజూరయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఎంసి చైర్మన్ విరుకపా శ్రీనివాస్‌రెడ్డి, అయా గ్రామాల సర్పంచులు తూం శ్రీకాంత్‌రెడ్డి, కర్ణాకర్, శిల్ప నర్సింలు, ఉప సర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు మాజీ సర్పంచ్ మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుజాత, ఇండ్ల కనకయ్య, మర్గోజు కర్ణాకర్, కందూరి ఐలయ్య, అందాలమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మంజ స్వామి పాల్గొన్నారు.

## పోటీతత్వంతో నైపుణ్యం పెగుతుంది : తహసీల్దార్

**కొండపాక, జనవరి 13, ప్రభాతవార్త :** ముగ్గుల పోటీల్లో మహిళల్లో దాగిఉన్న నైపుణ్యం బయటకు తీయడానికి ఎంతో ఉపయోగపడిందని కుకునూరుపల్లి తహసీల్దార్ దండి సుజాత అన్నారు. మంగళవారం లకుడారంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని మహిళలకు సర్పంచ్ శిల్ప నర్సింలు అధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ పోటీతత్వంతో నైపుణ్యం పెరుగుతుందన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతిగా ఎల నవజకు రూ॥ 4 వేలు, రెండవ బహుమతిగా పిట్ల మానసకు రూ॥ 2 వేలు, మూడవ, బహుమతిగా కంకనాల స్ఫూర్తికి రూ॥ వెయ్యి, నాలుగవ బహుమతిగా పైస సౌజన్యకు రూ॥ వెయ్యి నగదు బహుమతులు అందజేశారు. మొదటి, మూడవ, నాలుగవ బహుమతులను సర్పంచ్ అందించగా, రెండవ బహుమతి ఉపసర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డి అందించారు. పాల్గొన్న మరో 26 మందికి మినీ బహుమతులను ఎంపిటీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అందించారు. కార్యక్రమంలో అర్ఐ సత్యనారాయణ, విపిఒ సునీత, వార్డు సభ్యులు గట్టు చంద్రం, దేవినర్సింలు, రాచకొండ లావణ్య బిక్షపతి, చిరబోయిన సాయిలు, వంకని రాజు, కళా కర్ణాకర్, నాయకులు అన్నెమైన నర్సింలు, వంకని పోచయ్య, కంకనాల భిక్షపతి, ఎండి నవాబ్, ఎండి మైనోద్దిన్, లస్కరి రమేష్, దేవి భూపాల్, పునేందర్, కొత్త బాలకృష్ణ, వెంకట్‌చారి, ఎల వెంకట్, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**నర్సాపూర్, జనవరి 13, ప్రభాతవార్త:** పట్టణంలోని చైతన్యపురి కాలనీలో మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు మాదాసు రాణి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కాలనీలో గల సుమారు 150 ఇండ్ల ముందు కమలం పువ్వు ముగ్గులు వేయడం జరిగింది. ముస్లిం మహిళలు పాల్గొని హిందూ పండుగ సంక్రాంతి పండుగను గౌరవిస్తూ వారి ఇండ్ల ముందు కమలం పువ్వు ముగ్గులను వేయడం గమనార్హం. ముగ్గుల పోటీలను బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్‌దాస్ రాధా మల్లేష్‌గౌడ్ ప్రతి ఇంటింటికి తిరిగి ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలు ఈ ముగ్గుల పోటీలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజా సేవలో వాసవీ క్లబ్

**సిద్దిపేట అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త :** వాసవీ క్లబ్, వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చీకోటి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమారుడు కృష్ణ ఆర్థిక సహాయంతో పట్టణంలోని నిరాశ్రయుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నప్రసాద వితరణ చేశారు.పేదలకు సేవ చేయడానికి వాసవిక్లబ్‌లు ఎల్లప్పుడు ముందుంటాయని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, ఉమారాణి, నాగమల్ల సంధ్య, బుక్క అరుణ్, మర్యాల వీరేశం పాల్గొన్నారు.

# ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**నారాయణఖేడ్, జనవరి 13 ప్రభాతవార్త**

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉల్లి రైతులను ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మచ్చేందర్ కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది రాజకీయ అంశం కాదని, రైతు బతుకు కోసం సాగుతున్న న్యాయపోరాటమని అన్నారు. ఉల్లి విత్తనాల ధరలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయాయని, కానీ ప్రభుత్వం విత్తనాల ఖర్చులను భరించకపోవడంవల్ల రైతులు అప్పులు చేసి పంట సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో రైతులు తీవ్ర అప్పుల భారంలో కూరుకుపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి ధరలు తీవ్రంగా పడిపోయాయని,కనీసం క్వింటాలుకు ఏడు వందల ఇరవై రూపాయల ధరకూడా రావడం లేదని పేర్కొన్నారు. ఉల్లి రైతులకు కనీస మద్దతు ధరను క్వింటాలుకు ఏడు వందల ఇరవై రూపాయలుగా ప్రకటించకపోతే ఉల్లిసాగు పూర్తిగా నష్టంగా మారుతుందని హెచ్చరించారు. అలాగే ఉల్లి నిల్వ గిడ్డంగులు లేకపోవడం రైతులకు పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. దీంతో రైతులు వెంటనే పంటను అమ్ముకోవాల్సి వస్తోందని, ఈ పరిస్థితిని దళారులు అవకాశంగా మార్చుకుని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతుండగా, దళారులు మాత్రమే లాభాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎగుమతులు ప్రారంభిస్తే మార్కెట్లో ధరలు స్థిరపడతాయని, రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఉల్లి కొనుగోలు చేపట్టి రైతును ఆదుకోవాలని, దళారుల దోపిడీకి పూర్తిగా అడ్డుకట్ట వేయాలని కోరారు. సబ్ కలెక్టర్ ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే నర్సాపూర్ అభివృద్ధి

### మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నహీముద్దీన్

**నర్సాపూర్, జనవరి 13 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే నర్సాపూర్ మున్సి పాలిటీ అభివృద్ధి చెందిందని ఆ పార్టీ నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నహీముద్దీన్ అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్ల గడుస్తున్న నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. నర్సాపూర్ అభివృద్ధిని పట్టించుకోకపోగా ఎమ్మెల్యే సునీతారెడ్డిపై విమర్శలు చేయడం తగదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో నర్సాపూర్‌కు చెందిన ఒక నాయకుడు బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, భార్య ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్‌గా మళ్లీ అతడు నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్‌గా పదవులు అనుభవించి నర్సాపూర్‌ను అభివృద్ధి చేయకపోగా కన్నతల్లిలాంటి బిఆర్ఎస్ పార్టీని మోసం చేసి బిజెపిలో చేరి ఎమ్మెల్యే సునీతారెడ్డిని విమర్శించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఆయన మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో అతడిని కౌన్సిలర్‌గా గెలిపించిన 13వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఇప్పటివరకు లేదన్నారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నర్సాపూర్ మున్సిపాలిటీపై మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పంబల బిక్షపతి, నాయకులు సత్యంగౌడ్, రామచందర్, ఆంజనేయులుగౌడ్, రింగుల ప్రసాద్, ఆనంద్‌కుమార్, బాల్‌రెడ్డి, షేక్ హుస్సేన్, తొంట వినయ్, నాగరాజుగౌడ్, రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీగోదా రంగనాయకస్వామి కళ్యాణం

**వర్గల్, జనవరి 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో శ్రీగోదా రంగనాయకస్వామి కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం హీరాబాయమ్మతోటలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రంగాచారి, ఆలయ చైర్మన్ రవీందర్‌గుప్తా, ధర్మకర్తలు కొత్తపల్లి శ్రీనివాస్, చంద నాగరాజు, రుద్ర శ్రీహరి, సురేందర్‌రెడ్డి, శ్రీపతి కుటుంబసభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీపై గందరగోళం సృష్టించొద్దు

### -గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

**గజ్వేల్, జనవరి 13 (ప్రభాతవార్త):**

ఫార్మర్ రిజిస్ట్రీపై రైతుల్లో గందరగోళం సృష్టించొద్దని, ప్రభుత్వ పథకాల వర్తింపు కోసమే ఈ యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పిడిచెడ్‌లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెద్దిరెడ్డి అశోక్‌రెడ్డి, గజ్వేల్ ఏడిఏ బాబునాయక్‌లతో కలిసి ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సాగుకు సరిపడా ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచగా, ఇందుకోసం ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి చేసినట్లు స్పష్టం చేశారు. తద్వారా ఎరువులు దుర్వినియోగం కాకుండా చూడడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వ్యవసాయ పథకాలు, వివిధ రాయితీలు, రుణమాఫీ తదితర వర్తింపచేయడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు త్వరగా నమోదు చేసుకోవాలని, ఇందుకోసం వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుండి సేకరించిన సన్న ధాన్యానికి రూ.500 బోనస్ డబ్బులను రైతుల ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నేతలు సుఖేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, రవీందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పిడిచెడ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి

## శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి కరుణ అందరిపై ఉండాలి

### మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్, జనవరి 13 (ప్రభాతవార్త):** పట్టణంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, కొండపోచమ్మ దేవాలయ మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ మమత దంపతులు శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి మాలధారణ స్వాములకు, మాతలకు ఆతిథ్యం అందజేశారు.కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి మాట్లాడుతూ కలియుగ వైకుంఠ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి కరుణ కటాక్షాలతో అందరూ బాగుండాలన్నారు. వ్యాపారంలో రాణిస్తూ దైవ కార్యక్రమాలలో, సేవా కార్యక్రమాలలో ముందు వరుసలో ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న గోలి సంతోష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత నియమాలు పాటించాలి : సిఐ

**సదాశివపేట, జనవరి 13 (ప్రభాతవార్త):** సంగారెడ్డి జిల్లా ఎస్పీ ఆదేశాలతో అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా , వెల్టూర్ గ్రామంలో రోడ్ సేఫ్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ, సదాశివపేట ఎమ్మార్వో, ఆర్‌టిసి కొంట్రోలర్, సదాశివపేట మున్సిపల్ కమిషనర్, కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ మరియు వార్డు సభ్యులతో పాటు సుమారు 150 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు, ప్రమాదాలను నివారించడానికి తీసుకోవలసిన క్రింది తెలిపిన జాగ్రతలు గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదు, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయకూడదు, రాంగ్ రూట్‌లో వెళ్లకూడదు, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేయకూడదు, రోడ్ పై స్టంట్స్ చేయకూడదు,అతివేగంగా వాహనం నడపకూడదు, లైన్ క్రాసింగ్ చేయకూడదు,లెఫ్ట్ సైడ్ నుండి ఓవర్ టేక్ చేయకూడదు,ట్రాఫిక్ రూల్స్ పాటించాలి,ఇన్సూరెన్స్ అండ్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి, మైనర్ లకు వాహనాలు నడపడానికి అనుమతి ఇవ్వకూడదు తదితర నియమాలు వివరించా మన్నారు.

## ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా నర్సాగౌడ్

**నర్సాపూర్, జనవరి 13, ప్రభాతవార్త:** ఉప సర్పంచుల ఫోరం మండల కమిటీని మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది ఉప సర్పంచ్ ల సమావేశం ఏర్పాటు చేసుకొని కమిటీని ఏర్పాటు చేశారు. ఈమేరకు నర్సాపూర్ మండల ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులుగా ఏ నర్సాగౌడ్ నుఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈమేరకు ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులుగా ఎల్లాపూర్ ఉప సర్పంచ్ నర్సాగౌడ్, ఉపాధ్యక్షులుగా అచ్చంపేట ఉపసర్పంచ్ జి నవీన్, ప్రధాన కార్యదర్శిగా రంజాతాండా ఉప సర్పంచ్ సురేష్, గౌరవ అధ్యక్షులుగా పెద్ద చింతకుంట ఉపసర్పంచ్ కుమ్మరి అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా ఇబ్రహీంబాద్ ఉపసర్పంచ్ దాడిగా బాలయ్యతో పాటు మరో కొంతమందిని ఎన్నుకున్నారు. అయితే ఉప సర్పంచ్ ల ఫోరం మండల కమిటీని సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు మధుకర్ రెడ్డి, ఆవంచ సర్పంచ్ స్రవంతి కర్ణాకర్,ఇబ్రహీంబాద్ సర్పంచ్ కొండల్ రెడ్డి మాజీ సర్పంచులు జితేందర్ రెడ్డి ,సేనాధిపతి, మూసాపేట రవిలు కలిసి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం కమిటీ అధ్యక్షులు నర్సాగౌడ్ తో పాటుకమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో 30 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

### కమిషనర్ రామ్‌చరణ్‌రెడ్డి

**నర్సాపూర్, జనవరి 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు 6 ప్రాంతాలలో 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి తెలిపారు. మంగళవారంఈ పోలింగ్ కేంద్రాల వివరాలను మున్సిపల్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 15 వార్డులకు గాను 6 ప్రాంతాల్లో 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు హనుమంతపూర్ జగన్నాథ రావు కాలనీలో 1 వ వార్డు, ఆర్డీవో ఆఫీస్ వద్ద యుపిఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ వార్డు 10, 11,12 వార్డులకు కేటాయించగా మున్సిపల్ కార్యాలయం ముందు గల పాఠశాలలో 13, 14 వార్డులు, శివాలయం వీధిలో గల పాఠశాలలో 4 వ వార్డు కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో 2 వ వార్డు 3, 5,6, 7, 8:15 వార్డులకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ చరణ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, సీనియర్ సహాయకులు శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**మర్కుక్, జనవరి 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన ఒగ్గు బీరవ్వ అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ. 39వేల చెక్కును మంగళవారం మాజీ ఎంపిపి పాండుగౌడ్, బిఆర్ఎస్ బిసి సెల్ మండల అధ్యక్షుడు కనకయ్యముదిరాజ్, సర్పంచ్ భవాని బాల కిషన్ వారి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్, మాజీ ఎంపిటిసి రాజేష్‌గౌడ్, నాయకులు బేతి నరేందర్ రెడ్డి, కిష్టయ్యగౌడ్, బేతి మధుసూదన్‌రెడ్డి, స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కుమ్మరి కరుణాకర్, వార్డుసభ్యులు మ్యాకల శ్రీనివాస్, ప్రభాకర్, లక్ష్మణ్ గౌడ్, రాజు, స్వామి, కరుణాకర్, చిన్నబోయిన మల్లేష్, మురళి, లక్ష్మణ్, మేర వెంకటేష్, ఏడెల్లి మల్లేశం, ఒగ్గు లక్ష్మయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

# మునిసిపల్ చైర్మన్ పదవి కైవసం చేసుకోవాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**నర్సాపూర్, జనవరి 13, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి చైర్మన్ పదవిని కైవసం చేసుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే సునీతరెడ్డితోపాటు బిఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని హరీష్‌రావు నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ నర్సాపూర్‌లో బిఆర్ఎస్ నాయకులు ఒక్క తాటిపై ఉండి మున్సిపల్ ఎన్నికలలో నర్సాపూర్ చైర్మన్ పదవిని కైవసం చేసుకునేలా పనిచేయాలన్నారు. అంతేగాక గతంలో బిఆర్ఎస్ పార్టీ నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా పదవిని దక్కించుకోగా ఈసారీ పదవి కోసం నాయకులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే సునీతరెడ్డి సూచనలతో మున్సిపల్ పరిధిలోని 15 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల కోసం ఎమ్మెల్యేతో కలిసి చర్చించి ఏ వార్డుల్లో ఎవరెవరికి గెలిచే అవకాశాలు ఉన్నాయో వారిని బరిలో నిలిచే విధంగా చూడాలన్నారు. ఏ వార్డుల్లోనైనసరే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ పదవి దక్కించుకోవడం ఖాయం అన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్ గౌడ్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పంబల బిక్షపతి, నాయకులు సత్యంగౌడ్, మాజీ కౌన్సిలర్లు పంబల్ల రామచందర్, ఆంజనేయులుగౌడ్, నాయకులు బాల్‌రెడ్డి, రింగుల ప్రసాద్, రాకేష్‌గౌడ్, ఆనంద్‌కుమార్, షేక్ హుస్సేన్, మహమ్మద్ పాల్గొన్నారు.



హరీష్‌రావును కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు

## మంత్రి వివేక్‌వెంకటస్వామిని కలిసిన అత్తు

**సిద్దిపేట రూరల్, జనవరి 13,ప్రభాతవార్త :** జిల్లాలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు విచ్చేసిన రాష్ట్ర కార్మిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మంగళవారం సిద్దిపేట పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి. ఇమామ్(అత్తు) మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ కండువాతో ఘనంగా సత్కారించారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ త్వరలోనే సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని వార్డు నాయకులతో సమావేశం నిర్వహించాలని సూచించినట్లు అత్తు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గయాజుద్దీన్, హర్షద్ తదితరులు ఉన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు : సిఐ

**సిద్దిపేట రూరల్, జనవరి 13, ప్రభాతవార్త :** ప్రయాణమే కాదు ప్రమాదం లేకుండా ఇంటికి చేరడంముఖ్యమని పట్టణ టూ టౌన్ సీఐ ఉపేందర్ అన్నారు.జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఆటో, టాక్సీ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టప్రకారం తల్లిదండ్రులకు జరిమానాలతోపాటు జైలుశిక్ష విధించడం జరుగుతుందన్నారు.అవగాహన రహిత్యంతో రోడ్డుపై వాహనం నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు తోటివారి ప్రాణాలను అపాయం చేకూర్చిన వారవుతారని తెలిపారు. ఎంవిఐ శంకర్‌నారాయణ మాట్లాడుతూ ఆటోలలో పరిమితికిమించి ప్రయాణీకులను తీసుకెళ్లొదన్నారు. ఎఎంవిఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. రవాణాశాఖ పాలన అధికారి షేక్ నజీర్, కానిస్టేబుల్స్ రవీందర్, విక్టోరియా, హోంగార్డులు వెంకట్, అశ్రఫ్,రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన సదస్సు

**వెల్దుర్తి, జనవరి 13. ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మాసాయిపేటలోని రైతువేదికలో మంగళవారం తూప్రాన్ డిఎస్పి నరేంద్రగౌడ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ కలాకల్ గ్రామం నుండి రామంపేట వరకు మొత్తం 51 కిలోమీటర్లు 44వ జాతీయ రహదారి ఉందన్నారు. ఈ ఈ రహదారిపై ప్రతి కిలోమీటర్‌కు ఒక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్. రామాయంపేట సిఐలు రంగాకృష్ణ, వెంకటరాజాగౌడ్, చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, మాసాపేట సర్పంచ్ వీరన్నగారి కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి సిద్ధిరాములుగౌడ్, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనాలుదారులు హెల్మెట్ ధరించాలని. కార్లు ఇతర భారీ వాహనాలు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని డిఎస్‌పి నరేంద్ర గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్ఞాన జ్యోతి, రోడ్డు భద్రత ప్రమాణాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

## చైన మాంజా వాడితే చర్యలు : ఎస్ఐ

**నారాయణఖేడ్, జనవరి 13 ప్రభాత్తవార్త :** సంక్రాతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేసే సమయంలో చైనా మాంజను ఉపయోగించ వద్దని ఎస్ఐ శ్రీశైలం అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని వివిధ పతంగుల దుకాణాల తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో విక్రయిస్తున్న దారాలు, పతంగులు, మాంజాలను పరిశీలించారు. ప్రమాదానికి కారకంగా నిలుస్తున్న చైనా మాంజాను విక్రయిస్తే చర్యలు తప్పవని దుకాణాల యజమానులకు స్పష్టం చేశారు. పతంగులు ఎగురవేసే సమయాల్లో ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకుగాను కొనుగోలు కోసం వచ్చిన పిల్లలకు పలు సూచనలు, సలహాలనిచ్చారు. గాలి పతాలతో పాటు పక్షులను స్వేచ్ఛగా ఎగుర వేయనిద్దామని చెప్పారు. చైనామంజాను నిల్వ ఉంచితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## రోడ్డు నిబంధనలపై సిఐ అవగాహన

**న్యాల్‌కల్, జనవరి 13, ప్రభాతవార్త:** రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేస్తే రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉంటామని జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హనుమంతు అన్నారు. మంగళవారం న్యాల్‌కల్‌లో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు వాహనాలు తోలేందుకు అవకాశం ఇవ్వరాదన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్‌ను, కారు చోదకులు సీటు బెల్లును విధిగా ధరించి వాహనాలు రోడ్డెక్కించాలన్నారు. నిదానంగా వాహనాలు నడపాలని, తమ కోసం ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురు చూస్తూ ఉంటారని గుర్తించి వాహనాలు పడపాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ దోమ సుజిత్, గ్రామస్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చైనా మాంజాను వాడొద్దు : దేశబోయిని నర్సింలు

**గజ్వేల్ టౌన్, జనవరి 13 (ప్రభాతవార్త):** సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు, యువకులు పతంగులను ఎగరేస్తారని, అయితే పతంగులను ఎగరవేయడానికి వాడే చైనా మాంజాతో మృత్యువు పొంచి ఉందని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింలు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సాధారణ నూలు దారానికి బదులుగా నైలాన్ లేదా సింథటిక్ పదార్థాలతో తయారుచేసే ఈ మాంజాకు గాజు ముక్కలపొడి, రసాయనాలు పూయడం వల్ల ఇది పదునైన కత్తిలా మారుతుందని తెలిపారు. పతంగులు ఎగరేసే క్రమంలో తెగిపోయి గాలిలో వేలాడే ఈ దారాలు వాహనదారుల ప్రాణాలు బలి తీసుకుంటున్నాయని, పర్యావరణానికి, జీవరాశులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చైనా మాంజా విక్రయాలు, వాడకంపై పూర్తిస్థాయి నిషేధం విధించినప్పటికీ కొందరు వ్యాపారులు అధికలాభాల కోసం రహస్యంగా విక్రయిస్తున్నారని తెలిపారు. పోలీసులు చైనా మాంజా విక్రయాలను కట్టడి చేస్తున్నా, మార్కెట్‌లోకి ఇది వస్తూనే ఉందన్నారు. కేవలం జరిమానాలు, అరెస్టులతోనే సమస్య తీరదని, ప్రజల్లో అవగాహన పెరగాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయ నూలు దారాన్ని మాత్రమే ఉపయోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టేక్మాల్‌లో పతంగుల పోటీ

**టేక్మాల్, జనవరి 13, ప్రభాతవార్త:** స్వామి వివేకానంద యువజన వారోత్సవాల్లో భాగంగా టేక్మాల్ లో ఫోటో ఫన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం టేక్మాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో యువకులకు పతంగి పోటీలను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ యువతరం నిరంతరం స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా వ్యక్తిత్వాన్ని మలుచుకోవాలని అన్నారు. పతంగుల పోటీలను నిర్వహించడం వల్ల యువకులకు పిల్లలకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. స్వామి వివేకానంద యువతరానికి ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రమేష్, జిల్లా మైనార్టీ చైర్మన్ షేక మజహర్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, పట్టణ అధ్యక్షుడు కిషోర్, ఎన్ఎస్‌యుఐ ప్రెసిడెంట్ తలారి అశోక్, బిజెపి నాయకులు ఎల్లుపేట్ రాజు, మాజీ ఉపసర్, మంగలి శివయ్య, సల్ల అనిల్, ఎండి సజ్జాత్ సోహెల్ రోజ్ సయ్యద్ వసీం, రాషద్, హర్షత్‌హౌస్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు జగ్గారెడ్డితోనే సాధ్యం

**సదాశివపేట, జనవరి 13 (ప్రభాతవార్త):** పేదలకు ఇళ్ల స్థలాలు జగ్గారెడ్డితోనే సాధ్యం అని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ విశ్వనాథం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే పేదల ఇళ్ల స్థలాల కోసం సేకరించారని ఇప్పుడు కల్లబొల్లి మాటలు మాట్లాడే శివరాజ్ మా నాయకుడు జగ్గారెడ్డి వెంటే ఉన్నాడని మరి అప్పుడు ఎందుకు అడ్డుకోలేదని దుయ్యబట్టారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తే వారు మనల్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటారని నేను వైస్ చైర్మన్‌గా ఉన్నప్పుడు చింత ప్రభాకర్ ని చాలాసార్లు అడిగానని అది ఇప్పుడు అనవసరం అని అన్నారని అన్నారు. పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం మీకు ఇష్టం లేకపోతే వారికి ఇవ్వకూడదని ధర్నాలు చేయండి. వారి మేలు కోరే వారు అయితే మా నాయకుడితో కలిసి రండి అని అన్నారు. కొత్త గొల్ల శేఖర్ మాట్లాడుతూ ఎంఆర్ఎఫ్ కంపెనీ జిఎంతో సహా అందరూ నాకే తెలుసు అని ప్రగల్బాలు పలుకుతాడని,జగ్గారెడ్డి వెనకాల వచ్చిన అతను నేనే ముందు ఉన్నానని చెప్పుకుంటాడని అన్నారు. చింత ప్రభాకర్ ఎమ్మెల్యేగా ఉండి కూడా మా గొల్ల కురుమలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. మీరు చేయకపోగా పేద ప్రజల కోసం చేసే వారిని అడ్డుకోకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లతీఫ్, శంకర్‌గౌడ్ వున్నారు.

## పిడకల పంపిణీ

**గజ్వేల్ టౌన్, జనవరి 13 (ప్రభాతవార్త):** పట్టణంలోని అభయ హస్తం మిత్ర బృందం ఆధ్వర్యంలో మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మంగళవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్‌చైర్మన్ మురంశెట్టి రాములు సౌజన్యంతో పిడకలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, మల్యాల భద్రయ్య, వెంకటేశంపాల్గొన్నారు.



పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్‌రావు

## పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్ఓ

**సిర్గాపూర్, జనవరి 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి)ని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పనితీరుపై సిబ్బందితో శ్రీనివాస్‌రావు చర్చించి ఫార్మసీని తనిఖీ చేశారు. డాక్టర్‌తో పాటు సిబ్బంది తమ విధులను సమయసారిణి పాటిస్తూ విధులను నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి చేరుకున్న రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి శ్రీనివాస్, జై రామ్, ఫార్మాసిస్టు రఘు, ఎంపిహెచ్‌ఎ రాంచందర్, సిస్టర్లు ప్రమీల, యశోదలు పాల్గొన్నారు.

## గడిపెద్దాపూర్‌లో క్రికెట్ టోర్నీ ప్రారంభం



బ్యాటింగ్ చేస్తూ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శేషారెడ్డి

**అల్లాదుర్గం, జనవరి 13, ప్రభాతవార్త:** క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంచడంతోపాటు నాయకత్వ లక్షణాలు పొంపొందిస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టర్నమెంట్‌ను శేషారెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీపడాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ హరికృష్ణ, మాజీ ఎంపిటిసి విఠల్‌రెడ్డి, మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు అభిలాష్‌రెడ్డి, మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ జైపాల్, వార్డు సభ్యులు సత్యనారాయణ, ఆర్గనైజర్ ఆజాం, మోహన్, వెంకట్, మల్లేశం,డోల్లారి రాజు గౌడ్, ఉప సర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు కిష్టయ్య, రోషన్, నాబి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బేగంపేట తండా కమిటీ నియామకం



బేగంపేట తండా కాంగ్రెస్ కమిటీ

**కంది, జనవరి 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బేగంపేట తండా కాంగ్రెస్ కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. కమిటీ అడ్వైజర్‌గా దశరథ్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్‌నాయక్, బిసి సెల్ అధ్యక్షులుగా ప్రతాప్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గుర్రం ఆంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఆర్యనాయక్, ఉపాధ్యక్షులుగా ప్రసాద్‌నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా రహమత్, ఉపాధ్యక్షులుగా ఖాజా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నరేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా సాయి కుమార్‌నాయక్‌లను నియమించారు.

## అభివృద్ధికి చేయూతనందించండి : కార్పొరేటర్




డిప్యూటీ కమీషనర్ సన్మానిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జనవరి 13, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ కార్యాలయంలో మంగళవారం నూతన అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనరర్ ప్రదీప్ కుమార్, ఆయా శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ప్రతి అధికారి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్‌లో చివరి దశలోఉన్న గాంధీ బాలవిహార్ పార్క్, హిందూ శ్మశానవాటిక, మయూరి నగర్ పార్క్, ఓల్డ్ ఆర్‌పి పురంలో సీసీ రోడ్డు, మయూరి నగర్, అశోక్ నగర్, కనుకుంటలో సిసి రోడ్లు, శ్రీసాయినగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి కావాల్సి ఉందని, పనులు వెంటనే పూర్తయ్యేలా అధికారులు సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా గాంధీ బాలవిహార్ పార్క్ పనులను, ఓల్డ్ రామచంద్రాపురంలో మధ్యలో ఆపేసిన సిసి రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు.

## ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం



ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందచేస్తున్న లక్ష్మీశేషారెడ్డి

**అల్లాదుర్గం, జనవరి 13, ప్రభాతవార్త:** సంక్రాంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ గ్రామంలో సర్పంచ్ వీరన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో ప్రతిభ కనబర్చినవారికి వట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి బహుమతులను అందచేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో పండగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరరం ఉపాధ్యక్షురాలు సౌమ్య సురేష్ గౌడ్, సర్పంచ్ వీరన్న, సోషల్ మీడియ కో-ఆర్డినేటర్ జైపాల్, విశ్వేశ్వర్, చెన్నప్ప, పాపయ్య, బక్కన్న, అంజయ్య, శ్రీకాంత్, నర్సింలు, స్వరూప, వీరమణి, నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో ముగ్గుల పోటీలు

**సదాశివపేట, జనవరి 13 (ప్రభాతవార్త):**

సదాశివపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో ముగ్గుల పోటీలు గ్రామ సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ సెల్ మండల్ అధ్యక్షులు మాజీ సర్పంచ్ దుర్గం బోయిని కృష్ణ సహాయ సహకారంతో పోటీలు జరిగాయి. ముఖ్య అతిథులుగా సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, వెంకటేశం,బాలరాజు, ఆర్ఐ గంగాధర్, అర్చకులు విజయ సారథి, అఖిలేష్ పాండేస్వామి ముఖ్య అతిథులుగా రావడం జరిగింది పాల్గొన్న వారు ఉప సర్పంచ్ మహేందర్ మరియు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం మరియు వార్డ్ మెంబర్లు ఒ సునీత, డి కుమార్,డి కల్పన, మరియు పి శ్రీనివాస రెడ్డి,పి వెంకటేశం,డి పోచన్న,జి లక్ష్మణ్,ఎం సురేష్,జంజిరాల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

### మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్




మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

**పాపన్నపేట, జనవరి 13, ప్రభాతవార్త :** రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అ లీవ్" కార్యక్రమం ద్వారా ప్రజలకు రోడ్డు భద్రత, నియమాలు, నిబంధనలపై నేటి నుండి పది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలన్న తలంపుతో చేపట్టిన వారోత్సవాల్లో మంగళవారం పాపన్నపేట గ్రామ పంచాయతీ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంల ఉంటుందని అందువల్ల ప్రతి వాహనదారుడు హెల్మెట్‌తోపాటు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్టు ఉపయోగించక పోవడం వల్ల జరుగుతున్నాయన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి వాహనదారుడు, పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలను తగ్గించవచ్చునని ప్రజలకు అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ తమతోపాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు రాంగ్ రూట్లో నడపకూడదని తెలియజేశారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లను ఉపయోగించొద్దని,సెల్‌ఫోన్‌లో మాట్లాడకుండా డ్రైవింగ్ చేయాలని సూచించారు. చలికాలంలో మంచు కారణంగా ఓవర్‌టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పావని నరేందర్‌గౌడ్, మెదక్ రూరల్ సీఐ జార్జ్, పాపన్నపేట ఉప సర్పంచ్ సద్దాంహుసేన్, మాజీ ఉప సర్పంచ్ ఖలీం, వార్డు సభ్యులు, పోలీసు సిబ్బంది, వాహన చోదకులు, ప్రజలు పాల్గొన్నారు.



పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## క్యాలెండర్ ఆవిష్కరణ

**చౌటకూరు, జనవరి 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రూపొందించిన 2026 సంవత్సరం క్యాలెండర్‌ను ఎస్ఐ విశ్వజన్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అందోలు తాలుకా అధ్యక్షులు కె.శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం నిరంతరం పోరాడుతూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని శంకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం 2023 జులై డీఏ విడుదల చేయడం పట్ల ఎంపిడిఓ శంకర్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిఓ సువర్ణ, జూనియరర్ సహాయకులు శైలజ, పంచాయితీ కార్యదర్శులు వేణుగోపాల్, మల్లేశం, సిద్దమ్మ, కృష్ణవేణి, కంప్యూటరర్ ఆపరేటర్లు యాదగిరి, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత విద్యుత్‌కు ధరఖాస్తులు చేసుకోండి

### -కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

**న్యాల్‌కల్, జనవరి 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో లబ్ధిపొందేందుకు విద్యుత్ వినియోగదారులు ధరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం మరో మారు కల్పించిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఉచిత విద్యుత్ కొరకు ధరఖాస్తులు చేసుకుని గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలకు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

## గౌడ్‌గాంలో ఉపాధి పనులు ప్రారంభం

**సిర్గాపూర్, జనవరి 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గౌడ్‌గాంలో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులను సర్పంచ్ తానాజీరావు పాటిల్ ప్రారంభించారు. గ్రామ శివారులో రాళ్ల ఏరివేత పనులకు శ్రీకారం చుట్టినట్లు ఉపాధి హామి ఎపిఓ నర్సింహులు తెలిపారు. గ్రామంలో ప్రణాళిక బద్ధంగా ఉపాధి పనులను ప్రారంభిస్తామని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గట్టు పరిసరాల్లో సన్న, చిన్న కారు రైతుల వ్యవసాయ భూముల్లో రాళ్ల ఏరివేత పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

## నేడు పండరిపూర్‌కు పాదయాత్ర

**సిర్గాపూర్, జనవరి 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంతర్గాం పీఠాధిపతి గజేంద్ర భారతి ఆధ్వర్యంలో ఈ నెల 14న నారాయణఖేడ్‌లోని రామమందిరం నుంచి 28వ మహా పాదయాత్ర ప్రారంభం కానుంది. పాదయాత్రను పురస్కరించుకుని తగు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటలకు రామాలయంలో పూజలు చేసి పాదయాత్రను ప్రారంభిస్తామని, 17న కర్ణాటకలోని ఎకంబ గ్రామానికి పాదయాత్ర చేరుకుంటుందని గజేంద్ర భారతి వివరించారు. కులమతాలకు అతీతంగా పాదయాత్రలో పాల్గొని ఆడుతూ పాడుతూ స్వామి వారి ఆలయానికి చేరుకుంటామన్నారు.

## చౌటకూరులో అభివృద్ధి పనులు ప్రారంభం

**చౌటకూరు, జనవరి 13, ప్రభాతవార్త:** మండలకేంద్రంలో రూ.40 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సర్పంచ్ పార్కల రాంరెడ్డి మాజీ ఎంపిపి భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, పంచాయతీ పాలకవర్గం మంగళవారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో 9 హైమాస్ లైట్లు, నాలుగు బోర్లు, 70 సిసి కెమెరాలను ప్రారంభించారు. శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని పోలీసుల సూచన మేరకు ఆయా వీధుల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, అందర్ గ్రౌండ్ డ్రైనేజి, తాగునీటి పైప్‌లైన్, బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేస్తామని సర్పంచ్ పార్కల రాంరెడ్డి వివరించారు. గ్రామంలో సమస్యలు ఉంటే తనదృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కె శంకర్, ఎస్ఐ విశ్వజన్, ఉప సర్పంచ్ దమ్మీ నాగరాణి కృష్ణ, మాజీ సర్పంచ్ భూంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెండికోల్ సర్పంచ్ మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కలాలి రామాగౌడ్, గ్రామ అధ్యక్షులు వర్కల రమేష్, నాయకులు భూంరెడ్డి కృష్ణారెడ్డి, గొల్ల రాములు, పార్కల ప్రభాకర్ రెడ్డి, ఎల్లాటి మల్లికార్జున్‌గౌడ్, మంగలి చెన్నయ్య, కొల్కూరి మొగులయ్య, నరేందరరెడ్డి, నరేందర్‌గౌడ్, వార్డు సభ్యులు దప్పు అశోక్, గంగారరం, గోరేమియా, ఆకుల అభిలాష్, ఎల్ఐసి వీరన్న తదితరులు పాల్గొన్నారు.



సిసి కెమెరాలను ప్రారంబిస్తున్న సర్పంచ్ రాంరెడ్డి



ముగ్గుల పోటీలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్, తదితరులు

## ముగ్గుల పోటీలకు హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, జనవరి 13, ప్రభాతవార్త:** ముత్తంగి డివిజన్‌పరిధిలోని సాయి ప్రియ కాలనీలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని సీనియర్ నాయకులు ఆబేద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలకు ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి, అత్యుత్తమ ముగ్గులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం పట్ల ఆబేద్ ను అభినందించారు. బహుమతులు గెలుచుకున్న విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉపేందర్, నాయకులు దశరథ్‌రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, రవి, పాల్గొన్నారు.

### కార్మికుడి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే...

**పటాన్‌చెరు, జనవరి 13, ప్రభాతవార్త :** రెండు నెలల క్రితం పరిశ్రమలో ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అండగానిలిచారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మెరుగైన నష్టపరిహారం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. బొల్లారం డివిజన్ పరిధిలోని రాణే డై కాస్టింగ్ పరిశ్రమంలో రెండు నెలల క్రితం జరిగిన ప్రమాదంలో కృష్ణ సింగ్ అనే కార్మికుడు మృతి చెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే కార్మికుడు మృతి చెందాడని, మెరుగైన నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు. ఇందుకు అనుగుణంగా పరిశ్రమ యాజమాన్యం 20 లక్షల రూపాయల నష్టపరిహారం అందించేందుకు అంగీకరించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు నష్టపరిహారానికి సంబంధించిన 15 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా అందజేశారు. మరో ఐదు లక్షల రూపాయలు అతి త్వరలో అందజేయనున్నట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. కార్మికుల సంక్షేమం ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు. పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిటింగ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సంజయ్ సింగ్, సునీల్ సింగ్, ప్రిన్స్, టీంకు, తదితరులు పాల్గొన్నారు.

## గృహజ్యోతి లబ్ధిదారులకు గ్రీటింగ్ కార్డులు

**చౌటకూరు, జనవరి 13, ప్రభాతవార్త:** గృహజ్యోతి పథకంలో లబ్ధిపొందుతున్న వారికి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క్ సంక్రాంతి పండగ గ్రీటింగ్‌లు చెబుతూ సరఫరా చేసిన గ్రీటింగ్ కార్డులను ట్రాన్స్‌కో జేఏఓ ఆహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం పంపిణీచేశారు. మండలంలోని 2404 మంది గృహజ్యోతి పథకంలో లబ్ధిపొందుతున్నారన్నారని ఆహ్మద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఎల్ఎం వెంకట్, లైన్‌మెన్ అంజయ్య,సబ్‌స్టేషన్ ఆపరేట్లు పాల్గొన్నారు.

### కరపత్రికను ఆవిష్కరించిన మాధవానంద స్వామి

**అల్లాదుర్గం, జనవరి 13, ప్రభాతవార్త:**

శ్రీ వైదికస్మార్త జ్యోతిష పండితులు శ్రీ ప్రవీణ్‌శర్మ స్వగృహంలో మంగళవారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలో రంగంపేట పీఠాధిపతి మాధవనంద సరస్వతిస్వామి జ్యోతిష్యాలయ కర పత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాదశానంద సరస్వతి స్వామి భక్తు లకు ప్రవచనాలు చేశారు.

## శ్రీపంచముఖ హనుమాన్ విగ్రహానికి భారీ విరాళం

**జిన్నారం, జనవరి 13, ప్రభాతవార్త :** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో శ్రీపంచముఖ హనుమాన్ విగ్రహం నిర్మాణ కార్యక్రమంలో భాగంగా తాజా మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ 5,00,000/ లక్షల భారీ విరాళాన్ని ప్రకటించి 2,50,000/ కమిటీ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో ఎల్ రామచంద్ర గౌడ్, కే దుర్గయ్య, జి రాజు గౌడ్, గి. భగవాన్ సింగ్, టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సిహెచ్ గణేష్, జలగరి మల్లేష్, గి. గణేష్ సింగ్, పెరుగు భాస్కర్, ఆది ఆంజనేయులు, నర్సింలు, వీరేష్, నరసింహ గౌడ్, శ్రీనివాస్, అనిల్, ఆరేందర్, మహేందర్, విక్రమ్ సింగ్, సుదర్శన్, విజయ్ గౌడ్, వికాస్ సింగ్, హరి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న దృశ్యం

# 'మున్సిపల్'లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలి

### వాహన, చెత్తబుట్టల కొనుగోళ్లలో కమిషనర్ చేతివాటం...మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్




మాట్లాడుతున్న జితేందర్‌గౌడ్

**రామాయంపేట, జనవరి 13, ప్రభాతవార్త :** మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జరిపిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని మాజీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల, ఎమ్మెల్యే స్థాయి విచారణ జరగాలనీ, లేదంటే పక్షం రోజుల్లో మున్సిపల్‌ను ముట్టడిస్తామని, అవసరమైతే బంద్‌కు పిలుపునిస్తామని, బిఆర్ఎస్ నేత పల్లె జితేందర్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామాయంపేట మున్సిపల్‌లో కోట్లరూపాయలు కొల్లగొడుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపించారు. వాహన, చెత్తబుట్టల కొనుగోళ్లలో అవినీతి జరిగిందన్నారు. పారిశుధ్యానికివాడే వాహనాల్లోనూ డీజిల్ విషయంలో అవకతవకలు ఉన్నట్లు ఆయన తెలిపారు. నెలలో పక్షం రోజులు విధులకు రాకుండా కమిషనర్ దుమ్మాకొడుతూ వేతనాలు మాత్రం సక్రమంగా పొందటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో వాడిన బ్లీచింగ్ పౌడర్‌ను కొంత లెక్కల్లో చూపించి కొండంత చేసినట్లు చూపెట్టడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమంటూ విమర్శించారు. మున్సిపల్‌కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఉన్నతస్థాయి అధికారుల విచారణతోపాటు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాలయాపన చేస్తే పక్షం రోజుల వ్యవధిలో మున్సిపల్ ముట్టడికి, అవసరమైతే బంద్‌కు పిలుపునిస్తామంటూ హెచ్చరించారు.

సమావేశంలో సొసైటీ మాజీ చైర్మన్ బాదే చంద్రం, బిఆర్ఎస్‌నాయకులు అహ్మద్, హస్నొద్దీన్, ఉమా, కృష్ణ(కేకే), చింతల రాములు, పాతూరి సాయి, మద్దెల రమేష్, చింతల రాములు పాల్గొన్నారు.

## ఘనంగా గోదారంగనాథస్వామి కళ్యాణోత్సవం

**రామాయంపేట, జనవరి 13, ప్రభాతవార్త :** పట్టణంలో మంగళవారం పాండ చెరువుకట్టపై ఉన్న శ్రీసీతారాముల దేవాలయంలో శ్రీగోదా రంగనాథ స్వామి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. దేవాలయం ప్రధాన అర్చకుడు కూర్మాచలం సత్యనారాయణ, అర్చకులు శ్రీనివాస్,రాఘవాచారి, వాసుల ఆధ్వర్యంలో వేదమంత్రాలు జపిస్తుండగా, భక్తులు భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనీకుమారి, దేవాలయం పాలకమండలి సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలపై అవగాహన

**రామచంద్రాపురం, జనవరి 13, ప్రభాతవార్త:** రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని ట్రాఫిక్ ఎసిపి వెంకటయ్య అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో సొసైటీ కార్యాలయంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు, లింగంగం పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలు నివారణపై (అరైవ్ అలైవ్) అవగాహన కార్యక్రమానికి వెంకటయ్య, కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్‌లు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అరైవ్ అలైవ్ ఉద్యమాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. 10 రోజుల పాటు ఒక్కో రోజు అక్కో అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

### చిల్వర్‌లో...

**అల్లాదుర్గం, జనవరి 13, ప్రభాతవార్త:** ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చునని ఎస్ఐ శంకర్ అన్నారు. మండల పరిధిలోని చిల్వర్‌లో మంగళవారం జాతీయ రోడ్డు మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను, కారు చోదకులు సీటు బెల్టును ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. వాహనాలను నిదానంగా తోలాలని, తమ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తూ ఉంటారని గుర్తించి ప్రయాణం సాగించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, నేషనల్ హైవే సిబ్బంది, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

### చిలిపిచెడ్ మండలంలో...

**చిలిపిచెడ్, జనవరి 13 ప్రభాతవార్త :** వాహన చోదకులు రోడ్డు నిబంధనలు పాటించాలని చిలిపిచెడ్ ఏఎస్ఐ రాములు అన్నారు. మంగళవారం చిలిపిచెడ్ మండల పరిధిలోని ఫైజాబాద్, గంగారాం గ్రామాల్లో ఎవర్నెస్ పోగ్రామ్ ను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రాలులేకుండా వాహనాలు నడపకూడదని, హెల్మెట్, సీట్ బెల్ట్, ధరించాలని వ్యక్తులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తులే రోడ్డుపై వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులకు వాహనాలు ఇస్తే ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, విఠల్, నర్సింహారెడ్డి, నగేష్, కానిస్టేబుల్ దేవీసింగ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులను కలిసిన నూతన సర్పంచ్ మహేశ్వరీ



తహసీల్దార్ అశోకు సన్మానిస్తున్న నూతన సర్పంచ్ మహేశ్వరి

**కొండాపూర్, జనవరి 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చెర్లగోపులారం గ్రామ నూతన సర్పంచ్ గుంతపల్లి మహేశ్వరి సతీష్, ఉపసర్పంచ్ పుణ్యమ్మ లక్ష్మణ్ వార్డ్ మెంబర్లు మేతరి కిష్టయ్య, అంతపల్లి రవి, గుంతపల్లి నవీన్ సోమవారం మండల అధికారి సౌమ్య శ్రీ, తాసిల్దార్ బి అశోక్, ఎస్ఐ సోమేశ్వరి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరి మాట్లాడుతూ మీయొక్క సహ సహకారాలు మా గ్రామ పంచాయతీకి ఎంతో అవసరమని అన్నారు.

## ఉపాధి పనులు ప్రారంభం

**కొండాపూర్ జనవరి 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చర్ల గోపులారం గ్రామంలో మంగళవారం గ్రామీణ ఉపాధి హామీ పథక లో భాగంగా నూతన సంవత్సరంలో సర్పంచ్ మహేశ్వరి సతీష్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుణ్యమ్మ రాములు, వార్డ్ మెంబర్స్ సుజాత విద్య నందం, అంతయపల్లి రవి, ఎం కిష్టయ్య, జి నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ ధర్మయ్య గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## అంగన్‌వాడీ సెంటర్‌లో సంక్రాంతి వేడుకలు

**కొండాపూర్ జనవరి 13 ప్రభాతవార్త :**మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో మంగళవారం అంగన్వాడీ 4సెంటర్లో సంక్రాంతి బో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ సెంటర్లో టీచర్ రేఖ చిన్నారులతో సంక్రాతి,బోగి వేడుకలు నిర్వహించారు.చిన్నారులతో హరిదాసుల వేశాలు, ముగ్గుల పోటీలు గంగిరెద్దుల నృత్యాలు నిర్వహించారు. నంతరం సంక్రాంతి విశిష్ఠతను చిన్నారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అరుణ, సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులున్నారు.

## మాణిక్‌ను పరామర్శించిన దత్తు పటేల్

**మనూర్, జనవరి 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తోర్నాల్ గ్రామానికి చెందిన దేవనూరు మాణిక్ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదానికిగురై కాలుకు గాయం కావడంతో చికిత్స అందుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుసుకున్న బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దత్తు పటేల్‌మాణిక్ చెంతకు చేరుకుని రోడ్డు ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుట పడేవరకు విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తూ నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ మోసిన్, నాయకులు గుండన్న, కాశీనాథ్‌లు ఉన్నారు.

## సరాఫ్‌పల్లిలో మహిళలకు చీరెలు పంపిణీ

**చౌటకూరు, జనవరి 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సరాఫ్‌పల్లిలో సర్పంచ్ నందికంటి రామచంద్రారెడ్డి మంగళవారం 260 మంది మహిళలకు సంక్రాంతి పండగను పురస్కరించుకుని చీరలను పంపిణి చేశారు. తోబుట్టువులకు ఉచితంగా చీరలను అందించి పండ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి హామిని అమలు చేసి గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, నందికంటి నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు గృహజ్యోతి బాధ్యులకు గ్రీటింగ్ కార్డులు

**సిర్గాపూర్, జనవరి 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గృహజ్యోతి బాధ్యులకు 421 మందికి (200 యూనిట్ ఉచిత విద్యుత్) మంగళవారం సంక్రాంతి పండగ గ్రీటింగ్ కార్డులను గ్రామ పంచాయతీలో బుధవారరం పంపిణీ చేయనున్నట్లు విద్యుత్ లైన్‌మెన్ మైపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గృహజ్యోతిలో లబ్ధిపొందుతున్న మహిళలు పంచాయితీ కార్యాలయానికి చేరుకుని గ్రీటింగ్ కార్డులు అందుకోవాలని మైపాల్ సూచించారు.

## ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌ను కలిసిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు

**జహీరాబాద్, జనవరి 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ ట్రైనింగ్ డైరెక్టర్ జి.రమేష్‌ను మంగళవారం హైదరాబాద్‌లోనికార్యాలయంలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాఘవులు, కోహీర్ పట్టణ ప్రైమరీ స్కూల్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుఎం రవిలు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను డైరెక్టర్ రమేష్ దృష్టికి తీసుకుపోయారు.



ఎస్సీ ఈఆర్టీ డైరెక్టర్ రమేష్‌ను కలిసిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షులు